RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజ్‌గిరి | సంపుటి : 3 | సంచిక : 234 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శుక్రవారం, మార్చి,13, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 234 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Friday, March,13, 2026 | PAGES : 8 RS : 4 /- |



అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం ఆగాలంటే..

## ఇరాన్ మూడు షరతులు!

- అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం ముగింపునకు మూడు షరతులు పెట్టిన ఇరాన్
- తమ హక్కులను గుర్తించి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్
- భవిష్యత్తులో దాడులు జరగవని హామీ ఇవ్వాలని స్పష్టం చేసిన అధ్యక్షుడు
- తమ పోర్టులపై దాడి చేస్తే రీజియన్‌లోని అన్ని పోర్టులే లక్ష్యమని మిలిటరీ హెచ్చరిక

ఢిల్లీ,: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకడానికి ఇరాన్ మూడు కీలక షరతులను ముందుకు తెచ్చింది. ఒకవైపు శాంతి కోసం ప్రతిపాదనలు చేస్తూనే, మరోవైపు తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఆ దేశ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ షరతులను ప్రకటించారు. రష్యా, పాకిస్థాన్ దేశాధినేతలతో మాట్లాడిన తర్వాత ఆయన ఈ పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్, అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ముగించాలంటే ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు.



గ్యాస్ కొరతపై విపక్షాల

## ఆందోళన

**పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు**

**మకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన**

న్యూఢిల్లీ,మార్చి12 :'మోడీజి –ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదా లు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్టీపిన్ అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోడీ భయపడుతున్నా రని, బుధవారం పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురువుతన్నారన్నది స్పష్టమౌతోందని అన్నారు. గ్యాస్‌పై అబద్దాలాడుతున్న మోదీ సర్కారుగ్యాస్ కొరత విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది.




మేం తలచుకుంటే ఇరాన్‌ను అంధకారంలోకి నెట్టడం

## గంట పని

**– గంటలోనే ఇరాన్ విద్యుత్ వ్యవస్థను ధ్వంసం చేయగలమని ట్రంప్ హెచ్చరిక**

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము తలచుకుంటే కేవలం గంట వ్యవధిలోనే ఇరాన్ విద్యుత్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేయగలమని తీవ్రంగా హెచ్చరించా రు. అదే సమయంలో, కాలిఫోర్నియా తీరంలో ఒక పడవ నుంచి డ్రోన్‌లతో దాడి చేసేందుకు ఇరాన్ పన్నుతున్న కుట్రపై తమ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. కెంటకీ, ఒహియో పర్యటనల అనంతరం జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో విలేకరులతో మాట్లాడిన ట్రంప్ ఇరాన్‌తో యుద్ధంపై కీలక విషయాలు పంచుకున్నారు. "మేం తలచుకుంటే గంటలో వారి విద్యుత్ సామర్థ్యాన్ని కూల్చివేయగలం. దాన్ని మళ్లీ నిర్మించుకోవడానికి వారికి 25 ఏళ్లు పడుతుంది.

## విద్యార్థులకు సీఎం పినరయి విజయన్ లేఖ



**– 'అందమైన వాతావరణంలో చదువుకుందాం, ఆడుకుందాం..' అంటూ సమాధాన లేఖ**

కల్పేట: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నుంచి కల్పేట ప్రభుత్వ ఎల్పీ పాఠశాల విద్యార్థులకు అందిన సమాధాన లేఖ ఆనందాన్ని నింపింది. కొత్త పాఠశాల అందమైన వాతావరణంలో చదువుకోవడానికి, ఆడుకోవడానికి వీలు కల్పిస్తుందని సీఎం తన లేఖలో పేర్కొన్నారు. ముండక్కై విపత్తు బాధితుల కోసం ఏర్పాటు చేస్తున్న కొత్త టౌన్‌షిప్‌లో పాఠశాలను మార్చుతామని ముఖ్యమంత్రి ప్రకటించడంతో విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ లేఖ రాశారు. దీనికి ప్రతిగా ముఖ్యమంత్రి సమాధాన లేఖ పంపారు. ప్రస్తుతం పరిమిత సౌకర్యాలతో పనిచేస్తున్న కల్పేట ప్రభుత్వ ఎల్పీ పాఠశాలను కొత్త టౌన్‌షిప్‌కు మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టౌన్‌షిప్ ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాలకు భూమి కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. విద్యార్థుల లేఖకు స్పందిస్తూ సీఎం "ముండక్కై మరియు చూరాల్మల ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను మేము అర్థం చేసుకున్నాం.

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ప్రభుత్వ శాఖలు ఇకనుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలను (ఇ‌ఎం) మాత్రమే కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలని చెప్పారు.కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ విధానాలకు స్వస్తి చెప్పాలని, మొత్తం ఆన్లైన్లోనే కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రవాణా శాఖ అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్‌ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని, ప్రజల్లో చైతన్యం తేవడానికి షార్ట్ ఫిల్ముు ప్రదర్శించాలని సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్కు స్థలం కేటాయిస్తామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



ఇకపై ప్రభుత్వ శాఖలకు

## ఈవీ వాహనాలే

**సీఎం రేవంత్ రెడ్డి**



ఆదిలాబాద్ లో భగ భగ మండుతున్న

## ఎండలు

**ఆదిలాబాద్,తెలంగాణ దిశ :** ఆదిలాబాద్ జిల్లాలో వేసవి ఆరంభంలోనే భానుడు తన విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. మార్చి మొదటి వారంలోనే 38.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు మండుతుం డడంతో బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా ప్రధాన రహదారులు జన సంచారం లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. ఉక్కపోత నుంచి తప్పించుకోవడానికి ప్రజలు ఏసీలు, కూలర్లు, చల్లని పానీయాలను ఆశ్రయిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. రోజుకు కనీసం 5 లీటర్ల నీరు తాగాలని, కాటన్ దుస్తులు ధరించాలని వైద్యులు సూచిస్తు న్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో జిల్లా ప్రజలు ఆందోళనలో ఉన్నారు.

## దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత లేదు..

**పార్లమెంట్‌లో కేంద్రమంత్రి ప్రకటన..**



ఢిల్లీ,: ఇరాన్ యుద్ధం కారణంగా, దేశంలో గ్యాస్, పెట్రోల్ సంక్షోభంపై కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పూరి పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత లేదని స్పష్టం చేశారు. గృహ వినియోగదారులకు ఎలాంటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.


కమర్షియల్ గ్యాస్‌ను బ్లాక్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ముందుగా సాధారణ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. స్కూల్స్, హాస్పిటల్స్‌కు ఎలాంటి అవాంతరాలు లేకుండా సరఫరా చేస్తున్నామని చెప్పారు. మిగతా దేశాలతో పోలిస్తే చమురు విషయంలో భారత్ స్థానం పటిష్టంగా ఉందని స్పష్టం చేశారు.



కోర్టులపైనే గులాబీ

## ఆశలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ఎట్టకేలకు..ఊహించని ట్విస్ట్ ఇచ్చారు స్పీకర్ గడ్డం ప్రసాద్. ఫిరాయింపు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి కూడా క్లీన్ చిట్ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. పది మంది ఎమ్మెల్యేల ఎపిసోడ్‌లో మొదటి నుంచి దానం నాగేందర్, కడియం శ్రీహరి కేసులు మాత్రం సమ్‌థింగ్ స్పెషల్ అనే టాక్ ఉండేది. ఎందుకంటే దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లడమే కాదు..కాంగ్రెస్ బీఫామ్ మీద లోక్‌సభ ఎంపీగా కంటెస్ట్ చేశారు.ఇక తన కూతురు కడియం కావ్య కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా దాఖలు చేసిన నామినేషన్ పత్రంపై కడియం శ్రీహరి సంతకం చేసినట్లు అలిగేషన్స్ ఉన్నాయి. పైగా తన కూతురు గెలుపు కోసం కడియం ప్రచారం చేసినట్లు కూడా బీఆర్ఎస్ వీడియో ప్రూఫ్‌లు సబ్మిట్ చేసింది. ఈ కీలక ఆధారాలు ఉన్నాయని భావించి..ఈ ఇద్దరిపై స్పీకర్ వేటు వేస్తారని బలమైన ఒపీనియన్ కొనసాగింది. కడియంను సేవ్ చేసినా దానం నాగేందర్‌పై మాత్రం వేటు వేయడమో? రాజీనామానో? పక్కా అన్న టాక్ నడిచింది. ఇదేది జరగలేదు. ఎవరూ ఊహించనట్లు..కాంగ్రెస్ పెద్దలు కోరుకున్నట్లుగా స్పీకర్ తీర్పు ఇచ్చారని బీఆర్ఎస్ లీడర్లు మండిపడుతున్నారుపలుసార్లు కోర్టు స్పీకర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం..సభాపతి కూడా విచారణకు సమయం కోరడంతో..వేటు వేస్తారని బీఆర్ఎస్ కూడా బలంగానమ్మింది. ఒకానొక టైమ్‌లో ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్ బై ఎలక్షన్స్‌కు కారు పార్టీ రెడీ అవుతున్నట్లు కూడా ప్రచారం జరిగింది. కానీ ఫిరాయింపు ఎపిసోడ్‌లో కథ మళ్లీ మొదటికి వచ్చినట్లు అయింది. నెక్స్ట్ బీఆర్ఎస్ స్టెప్ ఏంటన్నదే కీలకంగా మారింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై వేటు కోసం మళ్లీ సుప్రీంకోర్టు మెట్లెక్కనుం దా? లేక కడియం, దానం విషయంలో మాత్రమే సీరియస్‌గా ఉందా? అసలు బీఆర్ఎస్ ఆలోచన ఏంటన్నది ఆసక్తికరంగా మారిందిఅయితే ఇప్పటికే సుప్రీంకోర్టులో తాము వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే..స్పీకర్ క్లీన్ చిట్ ఇస్తూ నిర్ణయం తీసుకోవడంతో..గులాబీ పార్టీ సరికొత్త వ్యూహాలను తెరలేపుతోందన్న చర్చ జరుగుతోంది. మరోసారి అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కేందుకు ప్రిపేర్ అవుతోందట



ప్రజా సేవలో భాగస్వామ్యం..

## భగవంతుడిచ్చిన వరం!

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఖమ్మం,తెలంగాణ దిశ :** గురువారం నాడు ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర్ రావు, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు హాజరయ్యారు.మంత్రి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మరియు సర్పంచులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. భగవంతుడు మనకు ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు సేవ చేసే ఒక అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చారు.

# ప్రజాప్రతినిధులు ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

## - కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మార్చి 12 (తెలంగాణ దిశ):**ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, అధికారులకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించే కార్యక్రమాల్లో మొత్తం పది ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వివరించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలులో అర్హతలు, ఎంపిక ప్రక్రియలపై ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక విజయవంతం కావడానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తేనే లక్ష్యాలు సాధ్యమవుతాయని అన్నారు. ఏప్రిల్ 2న గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏవైనా సందేహాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం విద్య, వైద్య, వ్యవసాయం, మహిళా--యువత సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీస్, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ శాఖల తరపున డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ వ్యర్థాలను అడవుల్లో వేయకుండా ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని, మొక్కలు విరివిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై రూపొందించిన పాటలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ చంద్రవతి, ట్రాఫిక్ ఏసీపీ వెంకట్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ చైర్మన్ నిర్సింహ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ కమిషన్ సభ్యులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు, నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్లు, వార్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.



# ముస్లిం సోదరులకు రంజాన్ కానుకల పంపిణీ



**కుత్బుల్లాపూర్, మార్చి 12, (తెలంగాణ దిశ):** రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా"(రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రగతి నగర్ లోని మసీదు వద్ద ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈ పథకం కింద దుస్తులు, ఇతర వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రంజాన్ పండుగ సోదర భావం, సహనం, సేవా భావానికి ప్రతీక అని అన్నారు. అవసరమైన ముస్లిం పేద కుటుంబాలకు అన్ని రకాలుగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధీర్ రెడ్డి, మహమ్మద్ నబీ, వాసు, మెడ శీను, రమేష్, నారాయణ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, రఫీయ బేగం, బికాంక్ష, సురేందర్ రెడ్డి, అరవింద్, రవీందర్, తులసీదాస్, ఆదిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, ఏవి రెడ్డి, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# కాప్రా నాలా బఫర్ జోన్‌లో భవన నిర్మాణం వివాదం

## - హైకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

| | |
|---|---|
| First Hearing Date | 05-01-2026 |
| Decision Date | 12-03-2026 |
| Case Status | CASE DISPOSED |
| Nature Of Disposal | Uncontested--WITHDRAWN |
| Coram | 3255-N.V.SHRAVAN KUMAR |
| Bench Type | Single Bench |
| Judicial Branch | WRIT Section |
| CauseList Type | MOTION LIST |
| State | TELANGANA |
| District | MEDCHAL-MALKAJGIRI |

కాప్రా, మార్చి 12, (తెలంగాణ దిశ) :కాప్రా ఊర చెరువు నుంచి ప్రవహిస్తున్న నాలా బఫర్ జోన్ పరిధిలో నిర్మాణం జరుగుతున్న జీ ప్లస్ 4 భవనం వివాదం మరో మలుపు తిరిగింది. ఈ భవన నిర్మాణానికి సంబంధించి యజమానులు తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను స్వయంగా ఉపసంహరించుకున్నారు. కాప్రా, సాకేత్ రోడ్డులో గణపతి ఆలయం పక్కన నిర్మాణం చేపడుతున్న ఈ జీం4 భవనం నాలా బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని స్థానికులు, సామాజిక కార్యకర్తలు గతంలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కాప్రా జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికే రెండు సార్లు కొంతమంది పిల్లర్లు, కాలమ్స్‌ను కూల్చివేసినట్లు సమాచారం. అయినప్పటికీ బిల్డర్ నిర్మాణ పనులను కొనసాగిస్తూ రెండు స్లాబ్‌ల వరకు నిర్మాణం చేపట్టాడు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణంపై వివాదం తలెత్తడంతో బిల్డర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి (డబ్ల్యూపి 168/2026) పిటిషన్ దాఖలు చేశారు. ఇదే సమయంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ ఇంప్లీడ్ పిటిషన్ ద్వారా పూర్తి ఆధారాలు, ఫోటోలు కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. అదే సమయంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ జోన్, కాప్రా సర్కిల్ అధికారులకు చేసిన ఫిర్యాదుల మేరకు జీహెచ్ఎంసీ అధికారులు స్థలాన్ని పరిశీలించి ఆరు పిల్లర్ల వరకు ఉన్న రెండు స్లాబ్‌లపై చిప్పర్ యంత్రంతో మార్కింగ్ చేసినట్లు తెలిపారు. మార్కింగ్ వరకు ఉన్న నిర్మాణం అక్రమమని, అది సెట్ బ్యాక్ లేదా నాలా బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. ఆరు పిల్లర్లు తొలగిస్తే మిగతా నిర్మాణం కూలిపోయే అవకాశం ఉందని కూడా అధికారులు అభిప్రాయపడినట్లు తెలిపారు. ఇక ఈ నేపథ్యంలో నిర్మాణ యజమానులు పరిస్థితిని అంచనా వేసుకొని హైకోర్టులో వేసిన పిటిషన్‌ను స్వయంగా ఉపసంహరించుకున్నట్లు తాడూరి గగన్ కుమార్ తెలిపారు. నాలా బఫర్ జోన్ భూమిని కాపాడేందుకు తన పోరాటానికి మద్దతుగా నిలిచిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అక్రమాలు, అన్యాయాలపై తన పోరాటం ఇదే విధంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.





# అగ్ని ప్రమాదంలో నష్టపోయిన ఫర్నిచర్ దుకాణ దారులను ఆదుకుంటాం - ఎమ్మెల్యే కేపీ వివేక్

**కుత్బుల్లాపూర్, మార్చి 12, (తెలంగాణ దిశ)** :ప్రగతి నగర్ కమాన్ వద్ద ఈ నెల 3న జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదానికి గురై నష్టపోయిన ఫర్నిచర్ దుకాణ యజమానులను ఆదుకుంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద హామీ ఇచ్చారు. గురువారం ఆయన టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివరెడ్డితో ఈ ఘటనపై చర్చించారు. అగ్ని ప్రమాదంలో ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమై దుకాణదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాంబశివరెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద బాధితులకు తన వంతు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వస్తానని తెలిపారు. ఈ సందర్భంగా బాధిత వ్యాపారులను ప్రభుత్వం, పార్టీ తరపున కూడా ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జలగం చంద్రయ్య, నిరు యాదగిరి, అంజన్ కుమార్ యాదవ్, కురుమూర్తి తదితరులు ఉన్నారు.



# కందిగూడలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు




**కాప్రా, మార్చి 12, (తెలంగాణ దిశ)** :కాప్రా డివిజన్ పరిధిలోని కందిగూడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ నాయకులు రోహిన్ ఆదేశాల మేరకు బీజేపీ కాప్రా డివిజన్ యువ మోర్చా నాయకుడు ఎస్. విభాకరన్ (బాబీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎస్. విభాకరన్ (బాబీ) మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి కృషి, బలం, సహకారం, కుటుంబం నుండి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళలు చేస్తున్న సేవలను గౌరవించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. మహిళల పట్ల గౌరవం పెంపొందించడం, వారి సాధికారతకు ప్రోత్సాహం ఇవ్వడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. స్థానిక మహిళా కార్మికులు సమాజానికి అంకితభావంతో సేవలందిస్తున్న మహిళలను ఈ సందర్భంగా అభినందించి, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని సుభాషిని, అరుణ్ జ్యోతి, మనీషా సమన్వయం చేశారు.







# ప్రజా సమస్యలను పరిష్కరించాలి

## - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, మార్చి 12, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ జోన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ నూతనంగా నియమితులైన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని 24 డివిజన్లలో నెలకొన్న వివిధ సమస్యలు, అలాగే నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయన పలు వినతి పత్రాలను కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ స్పందిస్తూ ప్రజలకు సంబంధించిన పలు సమస్యలపై సానుకూలంగా స్పందించి వాటిని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ జోన్‌లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరితగతిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యుఐ నాయకులు, వివిధ కాలనీల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, మున్సిపల్ అధికారులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చర్లపల్లి డివిజన్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన





**చర్లపల్లి, మార్చి 12, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఇంద్ర నగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో రోడ్లు, కాలువలు తదితర పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నర్సింహ రెడ్డి, శివ రెడ్డి, అనిల్ ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# ఇండియా ఆపరేషన్ సముద్ర

చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకుంది. సూర్యుడి మీద కూడా ప్రయోగాలు చేస్తోంది. అంతరిక్షంలో భారతీయ జెండాలు రెపరెపలాడించింది. నింగి, నేల, అంతరిక్షం.. ఇలా మూడు విభాగాలలో భారత్ తన సత్తాను చూపించింది. ఇకపై నీటిలో కూడా తన సామర్థ్యాన్ని నిరూపించుకోబోతోంది. అంతరిక్ష ప్రయోగాలతో ప్రపంచాన్ని మొత్తం తన వైపు తిప్పుకున్న భారత్.. ఇప్పుడు సముద్రంలో కూడా ప్రయోగాలను మొదలు పెట్టబోతోంది. ఎందుకంటే సముద్రంలో విపరీతమైన ఖనిజాలు.. విలువైన నిక్షేపాలు ఉన్నాయి. ఆ విలువైన నిక్షేపాలను గనుక బయటికి తీస్తే భారత ఆర్థిక ముఖ చిత్రం పూర్తిగా మారిపోతుంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో అతి త్వరలోనే సముద్రయాన్ ప్రాజెక్టుతో సముద్రపు లోపల ఉన్న రహస్యాలను తెలుసుకునేందుకు కీలక ప్రయోగం చేపట్టనుంది.. రెండేళ్ల క్రితమే సముద్రయాన్ ప్రాజెక్టును ఇస్రో అనౌన్స్ చేసింది.. అందుకోసం ప్రత్యేక సబ్ మెరైన్ ను రూపొందించింది. సముద్రయాన్ మిషన్ అనే ప్రయోగం ద్వారా మహా సముద్రాల అన్వేషణలో భాగంగా సముద్రాల లోపల ఉన్న ఖనిజ సంపదను అన్వేషించడానికి భారత ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇస్రో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి మహా సముద్రాలలో ఉన్న ఖనిజ సంపదను కనుగొనేందుకు మత్స్య 6000 అనే సబ్ మెర్సిబుల్ మిషన్ ద్వారా చెన్నై తీరంలోని 5 వేల మీటర్ల లోతులో ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టారు. ఆ తర్వాత మరింత లోతులో పరిశోధనలు చేపట్టనుంది. మన దేశ పరిశోధకులు సముద్రయాన్ ప్రయోగాన్ని మొదలుపెట్టారు. ఈ ప్రయోగంలో భాగంగా చెన్నై ఆధ్వర్యంలో నాలుగో తరం సబ్ మెరైన్ మత్స్య 600 ను మే నెలలో సముద్ర జలాల్లోకి ప్రవేశపెడతారు. డీప్ ఓషియన్ మిషన్ లో భాగంగా ఈ సబ్ మెరైన్ ను రూపొందించారు. 500 మీటర్ల లోతు వరకు ముగ్గురు ఆక్వా నాట్స్ ఇందులో ప్రయాణిస్తారు. ఒకవేళ కనుక ఈ ప్రయోగం విజయవంతం అయితే అమెరికా, రష్యా, చైనా, ఫ్రాన్స్, జపాన్ సరసన భారత్ నిలుస్తుంది. సముద్ర జలాల్లో విలువైన నిక్షేపాలతో పాటు, అరుదైన ఖనిజాలు కూడా ఉన్నాయి. కాకపోతే వీటిని అన్వేషించడం అంత సులువు కాదు. సముద్ర అంతర్భాగంలో అత్యంత కఠినమైన వాతావరణం ఉంటుంది. సముద్రాలలో నిత్యం జలాలు ఆటుపోట్లకు గురవుతుంటాయి. అంతర్భాగంలో కూడా విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. అలాంటప్పుడు అందులో ప్రయోగాలు చేయడం కత్తి మీద సాము లాంటిది. సబ్ మెరైన్ లు కూడా కొన్ని సందర్భాలలో ప్రమాదాలకు గురవుతుంటాయి. ఇన్ని ప్రతికూలతలు ఉన్నాయి కాబట్టి.. సముద్రంలో ప్రయోగాలు చేయడం అంత ఈజీ కాదు. సముద్ర గర్భంలో నిక్షేపాలను బయటకు తీస్తే.. వాటి ద్వారా ఎంతో విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రయోగం విజయవంతం అయితే 2026 లేదా 2027 చివరిలో మానవ సహిత సముద్రయాన్ ప్రాజెక్ట్ ను ఇస్రో జరుపనుంది. 28 టన్నులు బరువు కలిగిన మత్స్య 6000 అనే సబ్ మెరైన్ మిషన్ ద్వారా ఈ ప్రాజెక్ట్ ను జాతీయ మహా సముద్ర సాంకేతిక సంస్థ ద్వారా ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలాజీ రామకృష్ణన్ పర్యవేక్షణలో సముద్రయాన్ మిషన్ ను పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో మానవ సహిత గా ముగ్గురు శాస్త్రవేత్తలను ఎంపిక చేసి ఇందులో ప్రయాణించనున్నారు. అంతరిక్షంలో పరిశోధనలు చేపట్టే శాస్త్రవేత్తలను ఆస్ట్రోనాట్స్ గా పిలుస్తారు. సముద్రం లోపల పరిశోధనలు చేసే వాళ్లను ఆక్వానాట్స్ గా పిలుస్తారు. ఫ్రాన్స్ సహకారంతో భారత్ సముద్రయాన్ ప్రయోగాన్ని చేపడుతుంది. ఇందులో ముగ్గురు శాస్త్రవేత్తలు సబ్ మెరైన్ లో వెళ్లి పరిశోధన చేస్తారు. అందులో ఇద్దరు భారత కు చెందిన శాస్త్రవేత్తలు ఇప్పటికే పరిశోధనలు మొదలుపెట్టారు. వారిలో జితేంద్ర పాల్ సింగ్, రాజు రమేష్ లు ఇప్పటివరకు 5000 మీటర్ల లోతు వరకు డైవ్ చేసిన భారత్ రికార్డుగా ఈ ప్రయోగం ద్వారా సాధించారు. ఈ సబ్మెర్సిబుల్ 12 గంటల పాటు పనిచేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు కూడా సముద్రంలో ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రయోగం ద్వారా సముద్రంలో ఉన్న ఖనిజాలు, ఖనిజ సంపద,మినరల్స్, కోరల్స్ వంటి ఖనిజాలతో పాటుగా సము ద్రంలో ఉన్న ఇసుకలో కూడా ఏతరహా ఖనిజాలు ఉన్నాయి.. వాటి ఉపయోగాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. ఈ తరహా ప్రయోగాలను ఇప్పటివరకు అమెరికా, రష్యా, ఫ్రాన్స్, జపాన్, చైనా లాంటి దేశాలు మాత్రమే చేశాయి.. ఇప్పుడు ఇస్రో కూడా ఈ దేశాల సరసన చేరనుంది. ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రయోగానికి సంబంధించిన పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఇస్రో ఒకవైపు గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు సిద్ధమవుతూ నే సముద్రం లోపల శాస్త్రవేత్తల ద్వారా అత్యంత క్లిష్టమైన కీలకమైన ప్రయోగ ప్రక్రియను పూర్తిచేసే దశలో ఉండటం గర్వకారణమ నిపలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా భారత ఆర్థిక ముఖ చిత్రంపూర్తిగా మారిపోతుంది. భారత్ అభివృద్ధి చెందినదేశంలాకాకుండా..అభివృద్ధి చెందిన దేశంగా రూపాం తరంచెందుతుంది. ఉపాధి కోసం మన దేశ యువత విదేశా ల కు వెళ్లకుండా.. ఇక్కడే పనిచేసే పరిస్థితి ఏర్పడుతుంది.

# కీసరలో అక్రమ షెడ్ల హడావిడి.. అధికారుల మౌనం..?

**- అనుమతి లేకుండా నిర్మాణాలు జోరు**
**- ప్రధాన రహదారిపై భారీ షెడ్ నిర్మాణం**



**కీసర, మార్చి 12, (తెలంగాణ దిశ) :** కీసర సర్కిల్ పరిధిలో అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నారనే ఆరోపణలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాల్లో అనుమతులు లేకుండా భారీ షెడ్లు నిర్మాణం జరుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కీసర సర్కిల్ అక్రమ నిర్మాణాలకు కేంద్రంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పరిపాలనా పునర్విభజన తర్వాత కీసర సర్కిల్ ఏర్పడగా అధికారులు బాధ్యతలు స్వీకరించినప్పటికీ అక్రమ నిర్మాణాలపై కట్టడి కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే ఈసీఎల్ నుంచి కీసర వెళ్లే ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా భారీ షెడ్ నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల తనిఖీలు జరిగినప్పటికీ నిర్మాణాలు ఆగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జవహర్ నగర్ మున్సిపల్




కార్పొరేషన్‌లో పనిచేసిన టౌన్ ప్లానింగ్ అధికారి టీపీఎస్ స్రవంతి కీసర సర్కిల్‌లో బాధ్యతలు చేపట్టిన తర్వాత టీపీఎస్ డివిజన్ పరిధిలో పర్యటించి కొంత హడావిడి చేసినప్పటికీ, ఆ తరువాత మళ్లీ నిర్మాణాలు నిర్మొహమాటంగా కొనసాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ప్రభావశీలుల మద్దతుతోనే ఈ నిర్మాణాలు నిర్భయంగా కొనసాగుతున్నాయనే అభిప్రాయం



వ్యక్తమవుతోంది. ప్రధాన రహదారులు, వాణిజ్య ప్రాంతాల్లో భారీ షెడ్లు నిర్మించడంతో భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశముందని, పట్టణ ప్రణాళికకు కూడా ఇబ్బందులు కలుగవచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, అనుమతులు లేకుండా నిర్మించిన షెడ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కీసర ప్రాంతం పూర్తిగా అక్రమ నిర్మాణాల కేంద్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



# అనుమతులు లేకుండా అక్రమ వాణిజ్య షెడ్డు నిర్మాణం పట్టించుకోని అధికారులు...

**ఘట్కేసర్, మార్చి 12, (తెలంగాణ దిశ) :** జాతీయ రహదారి అవుషాపూర్ నుంచి ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఎలాంటి అనుమతులు లేకుండా వాణిజ్య అక్రమ షెడ్డు నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని ఈ ప్రధాన రహదారిపై గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా వాణిజ్య షెడ్డు నిర్మాణం జరుగుతున్నా ఎంఎంసీ ఘట్కేసర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. సర్కిల్ టౌన్ ప్లానింగ్ కార్యాలయం, కమిషనర్, మల్కాజిగిరి జోన్ ఏసీపీలు ఈ నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే విభాగాల్లో టౌన్ ప్లానింగ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంటే, ఇలాంటి అక్రమ నిర్మాణాలపై చర్యలు






తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు పత్రికల్లో ఈ విషయంపై కథనాలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం





గమనార్హం. అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ ఎంఎంసీ, ఘట్కేసర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం దేనికి సంకేతమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణంపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తురక చెరువులోకి డ్రైనేజీ నీరు

## అధికారుల తీరుపై బీజేపీ ఆగ్రహం



**కుత్బుల్లాపూర్, మార్చి 12, (తెలంగాణ దిశ):** నిజాంపేట సర్కిల్ ము న్సిపల్ అధికారులు ముందుచూపు లేకుండా వ్యవహరిస్తున్నారని నిజాంపేట బీజేపీ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ తురక చెరువులోకి ఒకవైపు డ్రైనేజీ నీటిని వదులుతూనే, మరోవైపు మోటార్లతో చెరువు నీటిని బయటికి పంపించడం విడ్డూరంగా ఉందని అన్నారు. గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు ముందు వరకు తురక చెరువులో ఎలాంటి డ్రైనేజీ నీరు కలపకపోవడం వల్ల స్థానిక ముదిరాజ్ కులస్తులు



చెరువులో చేపల పెంపకం చేపట్టేవారని ఆయన గుర్తుచేశారు. అయితే తరువాత వచ్చిన మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి ముందుచూపు లేకపోవడం వల్ల సమీప కాలనీలైన ఆర్జీకే, సాయి నగర్, రాంకీ బ్యాక్‌సైడ్ ప్రాంతాల నుండి వచ్చే డ్రైనేజీ నీటిని చెరువులోకి మళ్లించారని ఆరోపించారు. దీంతో చెరువులో విపరీతంగా గుర్రపు డెక్క పేరుకుపోయి దోమల సమస్య తీవ్రంగా పెరిగిందని, అలాగే దుర్వాసనతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిక్షపతి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మోటార్ల ద్వారా చెరువు నీటిని బయటికి పంపిస్తున్నప్పటికీ సాయి నగర్ రాజీవ్ గృహకల్ప మైదాస్ ప్రాంతం



తుర్క చెరువులోని నీటిని మోటార్ పంపు ద్వారా బయటికి పంపిస్తున్న దృశ్యం

నుండి వచ్చే డ్రైనేజీ నీటిని మాత్రం చెరువులోకి వదులుతున్నారని ఆయన విమర్శించారు. ముందుగా బయట నుంచి వచ్చే డ్రైనేజీ నీటిని చెరువులోకి రాకుండా దారి మళ్లించాలని, అనంతరం చెరువు నీటిని బయటికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే సాధ్యమైనంత త్వరగా చెరువును శుద్ధి చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను కోరారు.

# తల్లిదండ్రులూ... తస్మాత్ జాగ్రత్త..!

భారతీయ విద్యావిధానం మనిషి మేధావిని భాషించేలా.. ప్రపం చాన్ని శాసించేలా ఉండేది. అన్నిరంగాల్లో విద్యార్థులను ఆరితేరేలా చేసే మన విద్యావిధానం పాతపడి పోయింది. ఎందుకంటే దానిని పాతరేశారు. బ్రిటిషర్ల హయాంలో మెకాలే విద్యావిధానంతో మన విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది. అందుకే సమాజం లో నైపుణ్యత, నాణ్యత లేని విద్యను గడిస్తున్న విద్యార్థులు కోకొల్లలుగా పుట్టుకు వస్తున్నారు. వారికి నైపుణ్యాలు లేక ఎక్కడా రాణించడం లేదు. ఒళ్లు వంచి పనిచేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మనదే శంలో కోటళ్లల్లో నిరుద్యోగులు పెరిగి పోతున్నారు. వ్యవసా యం,దాని అనుబంధ రంగాల్లో అవకాశాలు దండిగా ఉన్నా..బిటెక్, ఎంటెక్‌లు చదివిన వారంతా ఇలాంటి పనులకు రాలేకపోతున్నారు. చదువు వేరు వృత్తి వేరు అన్న విధంగా ఆలోచించే ధోరణి కానరావ డంలేదు. భారతీయుల మేధస్సు అమోఘం, అద్భుత మని ప్రపం చం ఎప్పుడో గుర్తించింది. ఇప్పటికీ విదేశాల్లో రాణిస్తున్నది కూడా మనవారే. ముఖ్యంగా ఇంగ్లీష్, మ్యాథ్, సైన్స్ తదితర రంగాల్లో అద్భుత ప్రదర్శనను కనబరుస్తు న్నాం. అయితే ఈ దిశగా మానవ నరులను అభివృద్ధి చేసుకునేలా విద్యావిధానం రావడం లేదు. సమాజంలో విలువలు పడిపోవడానికి, యువతలో నైపుణ్యాలు లేకపోవడం కూడా విద్యావిధాన లోపంగానే గుర్తించాలి. అత్యాధు నిక ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థుల్లో నైపుణ్యత కొరవడింది. ప్రతిదానికి గూగుల్‌లో వెతికేస్తున్నారు. అలాగే గంటల తరబడి సెల్ ఫోన్లకు అతుక్కు పోతున్నారు. అలవా ట్లో భాగంగా యువత పోర్న్ వీడియోలు తిలకి స్తున్నారు. జూదా లకు బానిసలు అవుతున్నారు. అర్ధాంతరంగా తనువులు చాలిస్తు న్నారు. నిజానికి ఇదో సామాజిక రుగ్మత. దీనిని మార్చాలంటే అక్షరాభ్యాసం నుంచే క్రమశిక్షణ అలవర్చాలి. విద్యారంగాన్ని బలో పేతం చేయాలి. విలువ లతో కూడిన విద్యను నేర్పాలి. లేకుంటే మరింతగా సమాజం దెబ్బతి నగలదు. ఎందుకంటే ప్రస్తుతం పి ల్లలంతా సెల్ ఫోన్లకు అలవాటు పడ్డారు. చిన్న పిల్లవాడిని బుజ్జగిం చడానికి, అన్నం పెట్టడానికి కూడా సెల్ ఫోన్ వాడేస్తున్నాం. దీంతో పిల్లల్లో మానసిక పరిపక్వత లోపించి, తరగతి గదిలో పరధ్యానంగా వుండిపోతున్నారు. ఆటస్థలంలోనూ నిశ్శబ్దంగా వుంటున్నారు. చురుకుగా, రాటులేదలే కపోతున్నారు. పాఠాలు ఇప్పుడు చాలా చోట్ల స్క్రీన్ల మీద చెబుతు న్నారు. పిల్లలు వీటిని చూస్తూ టీచర్ల వైపు చూడ్డమే మానేశారు. వారితో సంభాషిం చడం లేదు. పరస్పర అవగాహన లోపిస్తోంది. దీంతో పిల్లలు టీచర్లు ఒకరికి ఒకరు దూర మైపోతున్నారు. తీరిక సమయాల్లో పిల్లలు వాళ్లలో వాళ్లు కూడా మాట్లాడు కోవడం మానేస్తున్నారు. ఇప్పటి పిల్లలది ఏదో ఒక కొత్త లోకమనిపిస్తోంది. మన కుర్రకారు యవ్వనమంతా అశాంతి, చిరాకు, ఆందోళన, ఒంటరి తనాలతో నిండిపోతోంది.

# భారీగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. హైద రాబాద్.. తెలంగాణ రాజధాని. విశ్వనగరంగా గుర్తింపు పొందింది. పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించడ ంతో ఇక్కడికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీంతో తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిరపుతున్నారు. కొందరు అద్దెకు ఉంటుండగా, కొందరు ఇళుల కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు మరియు ఉన్నత స్థాయి రెసిడెన్షియల్ ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా, హైదరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2024లో ఒక స్క్వేర్ ఫీట్ ధర సగటున రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండగా, 2025 నాటికి ఇది కొన్ని ప్రాంతాల్లో రూ.11 వేల నుంచి రూ.12,500 దాటింది. దీనికి ప్రధాన కారణాలు ఐటీ రంగ విస్తరణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, నగరంలోకి వలస వచ్చే జనాభా పెరుగుదల. అద్దెల విషయానికొస్తే, హైదరాబాద్‌లో అద్దె ధరలు కూడా పెరిగినప్పటికీ, ఇళ్ల ధరలతో పోలిస్తే అవి నిష్పత్తిలో తక్కువ వేగంతో పెరుగుతున్నాయి. గచ్చిబౌలిలో 2 ఃఊఖ అపార్ట్‌మెంట్ అద్దె సగటున రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంటే, అదే ప్రాంతంలో ఇంటి కొనుగోలు ధర రూ.80 లక్షల నుంచి రూ.1.2 కోట్ల వరకు ఉంటోంది. దీని ఫలితంగా, రెంటల్(అద్దె ద్వారా వచ్చే ఆదాయం శాతం) సగటున 4?5% వద్ద ఉంటోంది, ఇది ఇళ్ల ధరల పెరుగుదలతో సమానంగా లేదు. ఈ పరిస్థితి కొనుగోలుదారులకు ఒక సవాలుగా మారుతోంది, ఎందుకంటే అద్దెకు ఇళ్లు తీసుకోవడం కంటే కొనడం ఖరీదైన ఎంపికగా మారింది

# నష్టాలతో స్టాక్ మార్కెట్లు..!



బిజినెస్: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బల హీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నా యి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోం ది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయిం ట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాల జీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

మిశ్రమంగా అమెరికా మార్కెట్లు : అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ము గిసింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతు న్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.

# ఉక్కిరిబిక్కిరవుతున్న సచివాలయ ఉద్యోగులు!

## - సంబంధం లేని శాఖల పనుల అప్పగింతతో తీవ్ర పని భారం



**గుంటూరు,తెలంగాణ దిశ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఒక సర్వే పూర్తవ్వగానే మరో సర్వే బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో, ఉద్యోగులు క్షేత్ర స్థాయి సర్వేలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది. దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం సచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మంది మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్టు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్ హెల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించే, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయాల్సిన సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఓ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో ఉండలేకపోతు న్నారని,.తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అంకమ్మరావు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉద్యోగులకు అప్పగించేస్తున్నారని ఆయన చెప్పారు.

# వైసీపీ యూ టర్న్..!

**గుంటూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నా రు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉపయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

# నిరుద్యోగమే నిరసనలకు కారణమా?

**భారత్ పొరుగు దేశమైన నేపాల్ మాదిరిగానే లడఖ్ యువత ఇటీవల పెద్ద ఎత్తున నిరసన బాటపట్టారు. ఈ నిరసనల్లో పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాల్ని సైతం కోల్పోయారు. కేవలం కొన్ని లక్షల మంది ఉన్న లడఖ్‌లో నిరసనలు జరగడానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా కాదని బిజెపి వారిస్తోంది. మరేంటి కారణం.. అంటే నిరుద్యోగమే ప్రధాన కారణమని తెలుస్తోంది. లడఖ్ వివరాల్లోకి వెళితే..**



హెచ్చుస్థాయిలోనే అక్షరాస్యత..: లడఖ్‌లో ఉన్నది మూడు లక్షల జనాభానే. అక్కడ హిందువులు, ముస్లింలు, బౌద్ధ మతస్తులు ఉన్నారు. 90 శాతం గిరిజనులే. లడఖ్‌లో జాతీయ విద్యా పథకాలు మాత్రం పేలవంగానే అమలవుతున్నా.. అక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. పురుషులు 89 శాతం, మహిళలు 65 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల తరచూ బదిలీలతో పట్టణం వెలుపల ప్రాథమిక సెకండరీ స్థాయి విద్యా బోధనలు అంతంత మాత్రమనే చెప్పుకోవచ్చు. అయినప్పటికీ అక్కడ చిన్నారులు, తల్లిదండ్రులు చదువుకు ప్రాధాన్యమిస్తుండడం గమనార్హం.

వ్యవసాయం..: దాదాపుగా ఇక్కడ వర్షపాతం ఉండదు. పంటలు హిమనదీయ కరిగే నీటి కాలువలు, బుగ్గలు మీదే పంటలు పండుతాయి. సింధు నదీ లోయలలో దాని ఉపనదులపైనే గ్రామస్తులు ఆధారపడతారు. వారు ఎక్కువగా బార్లీ,
గోధుమలు, బఠానీలను పడిస్తారు. పండ్లలో నేరేడు, ఆపిల్స్‌ని పండిస్తారు. మరోవైపు పశువుల పెంపకందారులు పాడి, ఉన్నిలను ఉత్పత్తి చేస్తారు. మేక ఫైబర్‌లను వీరు కాశ్మీర్‌కు వర్తకం చేస్తారు. అయితే లడఖ్‌వాసులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేయడానికి మాత్రం విముఖత చూపుతున్నారు.

టూరిజం..: హిమాలయ పర్వతాలు, పాంగోంగ్ సరస్సు హొయలు, లోయలు.. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకుల్ని కనువిందు చేస్తాయి. లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకమే. 1974 నుంచే ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోనే వేలాదిమందికి ఉద్యోగ అవకాశాల్ని కల్పించాయి. ఇక్కడికి యూరోపియన్, అమెరికన్లు, భారతీయులు ఎక్కువమంది వస్తారు. ఇక్కడి పర్యావరణం పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నా.. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. విపరీతంగా నీటికొరత ఉంది. హిమాలయ పర్వతాల నుంచి కరిగే నీటిపైనే ఆధారపడడం.. పైపెచ్చు.. ఎక్కడికక్కడ ఆనకట్టల ద్వారా దిగువకు నీరు లేకపోవడంతో.. అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు కారణంగా వేసవిలో మంచు పర్వతాలు విపరీత స్థాయిలో కరుగుతున్నాయి. దీంతో శీతాకాలంలో నీటి సమస్య లేకపోయినా.. వేసవిలో మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు. సమ్మర్‌లోనే పర్యాటకుల రద్దీ ఎక్కువ. ఆ సమయంలోనే నీటి కొరత వల్ల పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతుంది. ఇది వారి జీవనాధారంపైనే ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం..: 2021-22లో 534 నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలకు 50 వేల దరఖాస్తుల్ని పంపారు. అంటే ఒక ఉద్యోగానికి ఆరుగురు పోటీ పడుతున్నారన్నమాట. ఈ విషయాన్ని స్వయంగా సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. 2021-22లో లడఖ్ నిరుద్యోగం 9.8 శాతం. అదే 2022-23కి 26.5 శాతానికి చేరిందని పార్లమెంటు సమావేశాల సందర్భంగా 2023లో రాజ్యసభలో ఎంపీలే వెల్లడించారు. ఇది జాతీయ సగటు నిరుద్యోగ రేటు 2021-22 14.9 శాతం, 2022-23 లో 13.4 శాతానికంటే ఎక్కువ.

సమస్యను పక్కదోవ పట్టించిన మీడియా: జాతీయ మీడియా మాత్రం అసలు సమస్యను పక్కకు నెట్టేసింది. ఇటీవల కాలంలో మీడియా ఏకాడికి లడఖ్ నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ ఫుంట్సోగ్ స్టాంజిత్ తెపాగ్ పాల్గొనడాన్నే హైలెట్ చేసింది. పూర్తిగా బిజెపికి వత్తాసునిచ్చింది. నిరసనలకు ముందు ఉద్యమకారుడు వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక నిరసనల గురించి ప్రసంగించారని.. ఆయన ఆయా దేశాల యువత చేపట్టిన నిరసనల్ని హైలెట్ చేయడం వల్లే బిజెపి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారని బిజెపి నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంత పెద్దఎత్తున నిరసనలు జరగడానికి కారణం.. కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ ఫుంట్సోగ్ నిరసనకారుల్ని రెచ్చగొట్టడం వల్లే జరగాయని బిజెపి ఆరోపిస్తోంది.

అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్యేక రాష్ట్ర హోదా కానీ.. ఆ డిమాండ్ తలెత్తడానికి గల కారణాల్ని కానీ మీడియా పట్టించుకోవడం లేదు. ఇదెంత దారుణం లడఖ్ జమ్మూకాశ్మీర్ కిందకే వస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం 1995 నుంచి సొంతంగా కౌన్సిల్ పాలన సాగుతుంది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక హోదా రద్దు చేయడంతో.. లడఖ్ వాసులు ప్రత్యేక రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల కోసం ప్రత్యేక అధికారాలు కలిగిన 6వ షెడ్యూల్ కిందకి లడఖ్‌ని తీసుకురావాలని వారు నినదిస్తున్నారు. 6వ షెడ్యూల్ ద్వారా.. జిల్లా కౌన్సిల్‌లు, శాసన, న్యాయ పరిపాలన స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అక్కడి భూమి.. పరిపాలనా, చట్టాలు అన్నీ వారి అధీనంలోకి వస్తాయనే కారణంతోనే లడఖ్ ప్రజలు రాష్ట్ర హోదా కోసం నిరసనలు చేస్తున్నారు. ఇక్కడి చైనా సరిహద్దు ప్రాంతంగా ఉందని.. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది.

# అమరావతికి హైస్పీడ్ కారిడార్..


**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాంతరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహ దారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చు తుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉన్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తు న్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.



# 100 రూపాయలతో రిజిస్ట్రేషన్

**కాకినాడ,తెలంగాణ దిశ :** ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపాయల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది. వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు.

# అక్షర యజ్ఞం..పంప భారత అనువాదం




పంప మహాకవి కన్నడ భాషలో రాసిన భారతం 500-600 పేజీలు కాగా, తెలుగు భాషలో 1,800 పేజీలతో వెలువడింది. దీనిని ఒక అక్షర యజ్ఞంగానే భావించక తప్పదు. ఎందుకంటే.. అనంతపూర్‌కు చెందిన డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్ర పంప భారతాన్ని కన్నడ భాష నుండి తెలుగు భాషలోకి (విక్రమార్జున విజయం) పేరిట అనువాదం చేయడంలో ఎంత సాహసించారో మాటల్లో చెప్పనలవి కాదు. 1,100 ఏండ్ల క్రితం కన్నడంలో రాసిన ఈ పుస్తకాన్ని ఎవరూ తెలుగు భాషలోకి తీసుకురాలేకపోయారు. ఈ పుస్తకంలో ప్రతి పదానికి అర్థం సవివరంగా పేర్కొన్నారు. పంపన కవి రాసిన భారతం అనువాదం బృహత్ ప్రయత్నమనే చెప్పకతప్పదు. ఈ బృహత్ యజ్ఞంలో జోస్యుల సదానంద శాస్త్రతో పాటు ఉభయభాషా విశారదులైన అనంతపూర్ శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత కన్నడ ఆచార్యులు డా కే .శేష శాస్త్ర, బెంగళూర్‌లోని ఆచార్య పాఠశాలకు చెందిన పండితులు డా కే ఆర్ గణేష్, శతావధాని డా ఆర్ గణేష్ తమ వంతు పాత్ర పోషించారు. తొంభై ఏండ్ల వయసులో ఉన్న అంతర్జాతీయ సాహిత్యమూర్తి హంపన కూడా తాను వేయించిన పంపన చిత్రాలు అందించి సాయం చేశారు. తెలుగు భాష పట్ల ఆయనకు ఉన్న గౌరవం .. తెలుగు ప్రజావళి పట్ల ఆయనకు ఉన్న అభిమానం వేనోళ్ల కొనియాడదగినది. తెలుగు సాహిత్య వికాసానికి తొలినాటి పునాదులు వేసిన పంపన కృషి మరొకసారి వెలుగులోకి వచ్చి, ఆయనకు తగిన గుర్తింపు, గౌరవం ఇప్పుడైనా తెలుగు సాహితీ లోకంలో దక్కాల్సి ఉంది.

బోధన్ ప్రాంతం మీద 30-50 పేజీలు: ఎప్పుడూ మూలాల్లోకి చూడాలి అని డా నాళేశ్వరం శంకరం అంటూ ఉండేవారు. బోధన్ చరిత్ర ఎంతో గొప్పది. అందుకే ఎప్పుడో 1,100 ఏండ్ల క్రితం రాసిన విక్రమార్జున విజయంలో బోధన్ ప్రాంతం మీద 30-50 పేజీలు ఉన్నాయంటే కుతూహలం కలిగింది. ఎన్నో ఏండ్లు ఆ పుస్తకాన్ని అనువాదం చేయించాలని తపన పడ్డాను. చివరికి అనంతపూర్‌లో జోస్యుల సదానంద శాస్త్రని సంప్రదించాను. అసలు పంపనే పూని జోస్యుల సదానంద శాస్త్రతో రాయించుకున్నాడా అనిపించేంత గొప్పగా శాస్త్ర ఈ పంప భారతం కన్నడ నుండి తెలుగు భాషలోకి అనువాదం చేశారు.

కథా సారాంశం: 14 అశ్వాసాలు ఉన్న ఈ 1,800 పేజీల పుస్తకం కన్నడ నుండి తెలుగులోకి అనువాదమైంది.

పంపన 9 శతాబ్దంలో రాసిన విక్రమార్జున విజయాన్ని తెలుగులోకి తీసుకురావటానికి ప్రథమ అడ్డంకి భాష, వర్ణనలు, పాత్ర చిత్రణ, రసపోషణ, ఛందస్సులు. ఎన్నో తరాల కిందటి పుస్తకం ఇది. భరతవంశ పుట్టుక నుండి మొదలైన ఈ కథ ఒకే వంశానికి చెందిన కొన్ని తరాల కథ. ముఖ్య ప్రాధాన్యం కురుపాండవ జననం ..రాజ్యాధి కారం కోసం జరిగిన ఘర్షణలు, చివరికి కురుక్షేత్ర సంగ్రామం.. శూరుల శౌర్యాలు.. యోధుల మరణాలు.. మరణించినవారి ఉత్తరక్రియలు.. వ్యూహాలు.. ప్రతివ్యూహాలు చివరికి కడుపు కోతలు.. అంతిమంగా కౌరవుల పతనం.. పాండవుల విజయం.. సుభద్ర అర్జునుల పట్టాభిషేకం.. కుంతి, గాంధారి, ధృతరాష్ట్రులు తపోవనానికి తరలిపోవటంతో కథ ముగుస్తుంది. స్వర్గారోహణ పర్వం మాత్రం ఉండదు. అర్జునుని నామకరణంలో అరికేసరి బిరుదులన్నీ అర్జునుని పేర్లుగా రాయటం, భారతంలో ఎవరినీ తలవకు.. కర్ణుని తలుచుకో.. భారతం కర్ణ రసాయనం అంటాడు పంపన.


శాంతా వసంత ట్రస్ట్ సాయంతో పుస్తకరూపం: అనువాదానికి నాలుగేండ్లు కష్టపడ్డా ..1,100 ఏళ్లుగా ఈ పుస్తకాన్ని ఎవ్వరూ తెలుగులోకి తీసుకు రాలేకపోయినా ..ఈ చరిత్రను ప్రజలకు అందించాలంటే ప్రచురణ కావాలి కదా..ఇది మళ్లీ ఒక పెద్ద యజ్ఞం అయ్యింది. మొండిధైర్యంతో అనువాదం పూర్తి చేయగలిగినా లక్షల్లో ప్రచురణ కావాలి. ఎన్నో అవాంతరాలు వచ్చినా ఏడాదిగా రైన్ బో ప్రింటర్స్ నరేంద్ర ఎంతో శ్రమకోర్చి పుస్తకాన్ని తయారుచేశారు. ఈ అనువాదంలో ఏ సమస్యకైనా సులువుగా పరిష్కారం సూచించే ఆచార్య తంగెడ కిషన్‌రావు సలహాతో.. డా.హరికృష్ణ మాట సాయంతో శాంతా బయోటెక్ సంస్థ అధినేత వరప్రసాదరెడ్డి సమ్మతించటంతో గొప్ప పుస్తకం అందరికీ దక్కాలనే సదుద్దేశంతో ఆకర్షణీయంగా ముద్రించి ఇచ్చారు రెయిన్ బో ప్రింట్ నరేంద్ర.

ఈ గ్రంథం ఒక ఆణిముత్యం..: ఈ బృహత్ ప్రయత్నం ఇంతటితోనే ఆగిపోకూడదు. తెలుగు సాహిత్య చరిత్రను మరొక రెండు వందల సంవత్సరాల పాటు పొడిగించగలిగే నేపథ్యాన్ని, బలమైన సాక్ష్యాలను అందిస్తున్న ఈ గ్రంథం ఒక ఆణిముత్యం. తెలుగులో విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, తెలుగు భాషాభిమానులు ఈ దిశగా మరింత విస్తృత పరిశీలన, పరిశోధన చేయాల్సిన అవసరం ఉందని ఈ పుస్తకం చెబుతుంది. అంతేకాకుండా తెలం గాణ సాహిత్య చరిత్రను ఈ గ్రంథం ప్రాతిపదికగా పునరుద్ధరించాల్సిన అవసరం ఏర్పడుతున్నది. తెలంగాణ చరిత్రకు దర్పణం ఇది. 1,100 ఏండ్ల క్రితమే పంప విక్రమార్జున విజయంలో బోధన్ ప్రాంతం గురించి విపులంగా రాశారు. పంపన రచనల పరిశోధన కోసం ఒక ప్రత్యేక అధ్యయన కేంద్రాన్ని బోధన్ ప్రాంతంలో కానీ నిజామాబాద్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో కానీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ, భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు శాఖలు, విశ్వవిద్యాలయాలు ఈ దిశగా మరిన్ని పరిశోధనలతో, విశ్లేషణల తో, గ్రంథాలను పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. పంపనను కన్నడ ప్రజలు ఆదికవిగా సొంతం చేసుకున్నప్పటికీ ఈ నేల బిడ్డగా కూడా మనం ఆయనను గౌరవించుకోవాల్సిన సమయం వచ్చింది. ఈ విధమైన బహుళ కోణాల్లో కృషి జరిగినప్పుడే తెలంగాణ విస్మృత సాహిత్య చరిత్ర వెలుగులోకి వచ్చి సంపూర్ణ సాహిత్య రూపం ఆవిష్కృతమవుతుంది. కన్నడ భాషకే కాదు.. తెలుగు భాషకు కూడా ఆదికవే..: కన్నడ భాషకి ఆదికవే కాదు.. తెలుగు భాషకు కూడా ఆదికవిగా పరిశోధకులు ఇప్పుడు తేలుస్తున్న పంప మహాకవి పంపభారతంతో పాటుగా చాలా గ్రంథాలు రాశాడు. ఎంతోమంది చరిత్రకారులు నిజామాబాద్ జిల్లా, బోధన్ చరిత్రను పరిశీలించి, పరిశోధించి ఎన్నో విషయాలు ఎరుకపరిచారు.

పంపకవి తెలంగాణ వాడేనని సాధికారికంగా చెప్పారు. నేలటూరి వేంకటరమణయ్య చెప్పినట్టు విక్రమార్జున విజయం కొత్త ఒరవడితో సాగే లౌకిక కావ్యంగా అర్జున పాత్రగా అనిపించినా అరికేసరి మాత్రమే మనకు కనిపిస్తాడు. విక్రమార్జున విజయాన్ని అంకితం చేసినందుకు తన ఆస్థానకవి అయిన పంపనను కవితా గుణార్ణవుడు అనే బిరుదుతో ఘనంగా సత్కరించాడు. కన్నడ, తెలుగు, సంస్కృత భాషల్లో అఖండ పాండిత్యం పంపనకే కాక అతని తమ్ముడు జిన వల్లభుడికి కూడా ఉందని.. కురిక్యాల శాసనాన్ని గుర్తు చేస్తున్నారు చరిత్రకారులు. తొలి తెలుగు కంద పద్యం అక్కడే కనిపించింది. జగిత్యాల దగ్గరి ధర్మపురి అగ్రహారాన్ని పంపనకి అనుగ్రహంతో దానం చేశారని చెబుతారు.

### సదానంద శాస్త్ర వైదుష్యం:


జోస్యులసదానంద శాస్త్ర కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా కమ్మరచేదులోజన్మించారు. తిరుపతి శ్రీ వేంకటే శ్వర ప్రాచ్య కళాశాల నుంచి పట్టభద్రులై శ్రీ వేంకటేశ్వర వర్సిటీ నుంచి ఎంఏ చేశారు. బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి 'పంప- నన్నయ తులనాత్మక అధ్యయనం'పై డాక్టరేట్ చేశారు. అనంతపురం సాయిబాబా నేషనల్ జూనియర్ కళాశాలలో 33 ఏండ్లపాటు అధ్యాపక వృత్తి నిర్వహించి 2010లోరిటైరయ్యారు. కన్నడం నుంచి తెలుగులో 20కి పైగా, తె లుగునుంచి కన్నడకు ఏడు గ్రంథాలు అనువదించారు. హరికథకు దుగాఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల్లో పేరు తెచ్చుకున్నారు. అష్టావధానాలు, ఆధ్యాత్మికోపన్యాసాలు,పురాణ ప్రవచనాలు ఆయనకు ఖ్యాతి తెచ్చాయి.



## నాలుగు పదులు దాటితే..

చికిత్స కంటే నివారణే ఉత్తమమైనది అని తరచుగా వింటుంటాం. ఖరీదైన చికిత్స, ప్రాణహానికలిగించే రోగాలపట్లేకాదు వస్తేపోని పలురకాల జబ్బులకు కూడా ముందు జాగ్రత్తే ఉత్తమం. ముఖ్యంగా నలభై దాటాక ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వాళ్లు ఆరోగ్యంగానే కాదు, ఆర్థికంగానూబాగుంటారు. అయితేఆరో గ్యంపై అవగాహన లేక చాలా మంది వైద్య పరీక్షల విషయంలో దాటవేత ధోరణి ప్రదర్శిస్తుంటారు. పరీక్షలు చేయించుకుంటే ఏదైనా రోగం బయటపడుతుందనే భయంతోనూ కొందరు టెస్ట్‌లకు వెనకడుగు వేస్తుంటారు. కానీ,ముదిరిన తర్వాత రోగం బయటపడితే, చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా బతుకు తయారవుతుంది. అందుకే ఒక వయసు వచ్చిన తర్వాత ఏడాది, రెండేండ్లకు ఒకసారైనావైద్య పరీక్షలు చేయించుకోవడం చాలా అవసరం. ఆరోగ్యంగా ఉండేందుకు, రాబోయే రోగాలను అంచనా వేసేందుకు ఏ వయసులో ఏ పరీక్షలు చేయించుకోవాలో నిపుణులు సూచిస్తున్నారు. ఎన్నాళ్లకు ఒకసారి పరీక్షలు అవసరమో చెబుతున్నారు. ఫుల్‌బాడీ చెకప్‌లకు డబ్బులు వృథా చేయకుండా, వయసుకు తగ్గ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సలహా ఇస్తున్నారు. లక్షణాలేవీ బయటపడకుండాశరీరంపై దాడి చేసే రోగాల విషయంలో నలభై దాటాక అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. కొన్ని పరీక్షలు అనివార్యంగా చేయించుకోవాలి. బీపీ: కనీసం ఏడాదికి ఒక్కసారైనా బీపీ చెకప్ చేయించుకోవాలి. హైపర్ టెన్షన్ అనేది గుండెపోటు, గుండె జబ్బులకు దారితీస్తుంది. కాబట్టి రెగ్యులర్‌గా బీపీ చెకప్ చేసుకుంటూ ఉండాలి.ఫాస్టింగ్ గ్లూకోజ్/గ్లయికాసిలేటెడ్ హిమోగ్లోబిన్ (హెచ్‌బీఏవన్‌సీ): కనీసం మూడేళ్లకు ఒకసారి చేయించుకోవాలి. ఇది చిన్న వయసులోనే వచ్చేడయాబెటిస్, బరువు కోల్పోవడాన్ని ముందే చెబుతుంది. లిపిడ్ ప్రొఫైల్: ప్రతి మూడు నుంచి అయిదేండ్లకు ఒకసారి చేయించాలి. సాధారణ కొలెస్ట్రాల్ లెక్క తప్పుదారి పట్టిస్తుంది. కాబట్టి ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ పరిమాణంపై దృష్టిపెట్టాలి. శరీర బరువు, నడుము చుట్టుకొలత:పొట్టపెరగడం రక్తప్రసరణవ్యవస్థపై ప్రతికూలత చూపుతుంది. అందుకే శరీరంలో వచ్చే మార్పులు గమనిస్తూ ఉండాలి. కంటి పరీక్ష:ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించాలి. దృష్టిలోపాలు,గ్లకోమా సమస్య ఉన్నట్లయితే చికిత్స తీసుకోవాలి.డెంటల్ చెకప్: దంత సమస్యలు. గుండె జబ్బులు, షుగర్ వ్యాధికి కారణమవుతాయి. కాబట్టి ఏడాదికి ఒకసారైనా దంత పరీక్షలు చేయించుకోవాలి.పొగాకు,మద్యం,పదార్థాలవినియోగంఉంటే వాటి వల్లవచ్చే సమస్యలకు కూడా అదనంగా పరీక్షలు చేయించుకోవాలి.

# కాలుష్య కోరల్లో సిటీ శివార్లు




### వ్యర్థ జలాలతో నిండిపోతున్న ఖాళీ స్థలాలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గ్రేటర్ హైదరాబాద్ శివార్లు మరింత విస్తరిస్తున్నా యి. అంతే వేగంగా శివారు ప్రాంతాల్లో పెద్ద పెద్ద రెస్టారెంట్లు, హోటళ్లు, పబ్‌లు వెలుస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, కన్వెన్షన్ హాళ్ల నుంచి ఆహార వ్యర్థాలతో పాటు వ్యర్థ జలాలు కూడా భారీ మొత్తంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయకుండా ఇష్టారీతిన బహిరంగ ప్రదేశాల్లోకి వదులుతున్నారు. ఎక్కడా నిబంధనలు పాటించకుండా పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు వదులుతున్న వ్యర్థాలతో పరిసరాలన్నీ మురుగుతో నిండిపోతున్నాయి. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతూ పరిసర ప్రజలతో పాటు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హోట ళ్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, పబ్‌ల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా భూమి, గాలి కాలుష్యానికి పాల్పడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, పురపాలక శాఖల అధికారులు కనీస తనిఖీలు నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నా యి. కోట్లాది రూపాయలతో ఏర్పాటుచేసిన హోటళ్లలో కనీసం ఎస్టీపీలు,సెప్టిక్ ట్యాంకులు నిర్మించు కోవడం లేదు. సెప్టిక్ ట్యాకులు, ఎస్టీపీలు లేకున్నా సంబంధిత అధికా రులు నిర్వహణకు అనుమతులెలా ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ మహానగరం మరింతగా విస్తరించింది. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టడంతో రియల్ ఎస్టేట్ రంగం ఉరకలేసింది. దీంతో నగరం నలువైపులా గణనీయంగా విస్తరించింది. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో హైరేజ్ అపార్ట్‌మెంట్లు, వరల్డ్ క్లాస్ రెస్టారెంట్లు, రిసార్ట్స్ ఏర్పాటు ఊపందుకోవడంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శివార్లలోకి నాలా కనెక్షన్ అవసరం లేదని, ఎక్కడికక్కడ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. దీంతో శివారు ప్రాంతాల్లోని అన్ని బహుళ అంతస్తుల్లో ఎస్టీపీలను నిర్మించుకుంటున్నారు. అదేవిధంగా హోటళ్లు, రెస్టారెంట్లలో కూడా ఎస్టీపీలు నిర్మించుకుని వ్యర్థాలను ప్రాసెస్ చేయాలని ప్రభుత్వ అధికారులు ఆదేశించారు. కానీ కొంతమంది అక్రమార్కులు హోట ళ్లు, రిసార్ట్స్, రెస్టారెంట్లు, పబ్బుల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేసుకోకుండా పైపుల ద్వారా వ్యర్థాలను చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాల్లోకి వదులుతున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతూ భూమి, గాలి కాలుష్యం ఏర్పడుతున్నది. వర్షాకాలంలో పరిస్థితి మరింత తీవ్రతరమ వుతున్నది. శివారు ప్రాంతాల్లో ఎక్కువగా వివాదాల నడుమ ఉన్న భూములు కోర్టు కేసుల వల్ల ఖాళీగా ఉండటంతో అందులోకి యథేచ్ఛగా వదులుతున్నారు. అధికారులు కూడా చూసీచూడన ట్లు వ్యవహరిస్తు న్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా ఔటర్ రింగ్‌రోడ్డు పరిస రాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా దర్శనిమిస్తున్నాయి. నగరానికి చుట్టూ ఇదే తంతు కొనసాగుతున్నా జీహెచ్ఎంసీ, కాలుష్య నియంత్రణ మండలి, జల మండలి అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఎస్టీపీ లులేని హోటళ్లు, రెస్టారెంట్లు, రిసార్ట్స్, పబ్‌లపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు. లేదంటే శివారు భూములన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీలో రాజ్యసభ రేస్ షురూ..!

**అమరావతి,తెలంగాణ దిశ :** ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. ఈ ఏడాది జూన్ తో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అంతకంటే ముందే వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక జరగనుంది. అయితే కూటమికి స్పష్టమైన బలం ఉండడంతో.. ఆ నాలుగు స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడంతో ఆ పార్టీకి ఛాన్స్ లేదు. ఆ పార్టీ పోటీ చేయదు కూడా. ప్రస్తుతం వైసీపీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు రాజ్యసభలో. అయితే ముగ్గురు ఖాళీ కానుండడంతో నలుగురు సభ్యులు మిగలనున్నారు. అయితే కూటమి పార్టీలో మాత్రం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.ఈ ఏడాది జూన్లో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్, వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యం. ఏడాది కిందట సాన సతీష్ టిడిపి తరఫున గెలవడంతో ఆయనకు రెన్యువల్ చేయనున్నారు. అయితే మిగతా మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను తీసుకుంటుంది? జనసేనకు ఎన్ని? బిజెపికి ఎన్ని? అనేది చర్చ నడుస్తోంది. అయితే మొత్తం నాలుగు ఎంపీ స్థానాల్లో టిడిపికి మూడు, జనసేనకు ఒకటి దక్కే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో జనసేనకు అవకాశం కల్పించలేదు. బిజెపి ఎక్కువ ఎంపీ పదవులను దక్కించుకుంది. అందుకే ఈసారి బిజెపికి ఛాన్స్ లేదని.. జనసేనకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి మూడు పార్లమెంట్ స్థానాలకు గాను.. ఒకటి సానా సతీష్ కు కొనసాగింపు ఉంటుంది. మిగతా రెండు ఎంపీ పదవుల కోసం పార్టీలో విపరీతమైన పోటీ ఉంది. ముఖ్యంగా వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, భాష్యం రామకృష్ణ, గల్లా జయదేవ్, దేవినేని ఉమామహేశ్వరరావు.. ఇలా చాలామంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడే ఓడిపోతానని తెలిసి రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు యనమల రామకృష్ణుడు సైతం రాజ్యసభ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని రకాల పదవులు అనుభవించారు. అందుకే ఇప్పుడు పెద్దల సభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు.

# దొడ్డుబియ్యం అమ్మకం సవాలే!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వానికి దొడ్డు బియ్యాన్ని వేలం వేయడం సవాల్‌గా మారింది. గోదాములు, రేషన్ షాపుల వద్ద నిల్వ ఉన్న దొడ్డు బియ్యం విక్రయానికి సివిల్ సప్లయ్ శాఖ టెండర్ పిలిచినా.. ఒక్క కంపెనీ కూడా ముందుకు రావడం లేదు. వేలం వేయడం ఆల స్యమైన కొద్దీ నష్టం కూడా పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో దొడ్డు బియ్యం విక్రయానికి మరోసారి టెండర్‌ను ఆహ్వానించి.. త్వరగా విక్రయించాలని సంబం ధిత శాఖ అధికారులు ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ పర్యాటకం రెండోసారి ఆహ్వానించే టెండర్‌లో.. కిలో బియ్యం ధరను కొంత తగ్గించాలనే ఆలోచనలో ఉన్నట్లుగా సమాచారం. సర్కార్ నుంచి అనుమతి రాగానే.. టెండర్ ఆహ్వానించా లనే యోచనలో ఉన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఉగాది నుంచి రాష్ట ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డులున్న వినియోగదా రులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అప్పటి వరకు రాష్ట్రంలో 1.40 లక్షల మెట్రిక్ ట న్నుల దొడ్డు బియ్యం మిగిలింది. ఈ బియ్యం విలువ సుమారుగా రూ.500 కోట్ల వరకు ఉంటుందని సివిల్ సప్లయ్ శాఖ అంచనా వేసింది. మిగిలిపోయిన ఈ దొడ్డు బియ్యం టెండర్ ద్వారా విక్రయించా లని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే గత నెలలోనే పేరుకుపోయిన దొడ్డు బియ్యానికి సివిల్ సప్లయ్ శాఖ టెండర్‌ను ఆహ్వానించినా.. ఒక్క టెండర్ కూడా రాలేదు. దీంతో దొడ్డుబియ్యం కొనుగోలు కోసం టెండర్లు వస్తే గత మంగళవారమే తెరవాలి. కానీ ఒక్క టెండర్ కూడా రాకపోవడం తో.. మరోసారి టెండర్లను ఆహ్వానా నికి కసరత్తు చేస్తున్నారు.అయితే దొడ్డు బియ్యం కొనుగోలుకు మొదటి సారి బిడ్డర్లు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం మొత్తం నిల్వగా ఉన్న 1.40 లక్షల టన్నులను ఒకే లాట్ కింద పెట్టడమే ఇబ్బందికరంగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఈ టెండర్‌క్ పెద్ద బిడ్డర్లు రాకపోవడం, చిన్నబిడ్డర్లు పాల్గొనే అవకాశం లేక పోవడం ప్రధాన కారణమని చెబుతున్నారు. కనీసం చిన్న లాట్లుగా ఏర్పాటుచేసి టెండర్ ఆహ్వానిస్తే ఎక్కువ సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అంతేకాకుండా వేలం వేయా లనుకున్న బియ్యం ధరను కిలో రూ.24గా సివిల్ సప్లయ్ శాఖ ముందే నిర్ణయించడం కూడా బిడ్డర్లు ముందుకు రాకపోవడానికి ప్రధానకారణ మని చర్చ ఉంది. వేలం వేయాలనుకుంటున్న దొడ్డురకం బియ్యం అప్పటికే పాతపడటం, సగానికిపైగా పురుగులు పట్టి నాణ్యత లోపించి ఉండటంతో ఆ ధర మరీ ఎక్కువ అని బిడ్డర్లు అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇది సివిల్ సప్లయ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, ముందుచూపులేని వి ధానంతోనే సర్కార్‌కు ఆర్థికంగా తీవ్రనష్టం చేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండోసారి ఆహ్వానించే టెండర్లలో మార్పు లు చేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే ఏప్రిల్ నుంచి రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణి చేస్తుందని తెలిసినా.. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి దొడ్డుబియ్యాన్ని సరఫరా చేశారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన తేదీ మేరకు ఏప్రిల్ నెలలోనే ఉగాది పండుగ రోజునే సన్న బియ్యం పంపిణీ ప్రారంభించడంతో.. గోదాముల్లో 1.4 లక్షల టన్నుల బియ్యం, రేషన్‌షాపు డీలర్ల వద్ద 40 వేల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలుగా పేరుకుపోయినాయి.రేషన్‌షాపుల్లోని బియ్యం పందికొక్కులు బుక్కి, ముక్కిపోయి పాడైపోతు న్నాయని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డీలర్లు అధికారులు ఇప్పటికే అనేకసార్లు ఫిర్యాదులు చేశారు. అధికారుల ఉదాసీనత వల్లే 10 నెలలుగా రూ.500 కోట్ల విలువైన బియ్యం అటు రేషన్‌దుకాణాలు, ఇటు గోదాముల్లో మూలుగుతున్నట్లుగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దొడ్డుబియ్యాన్ని వేలం వేయాలని అప్పటి సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేసినా టెండర్ పట్టాలెక్కడానికి 4నెలలు పట్టడం గమనార్హం. అధికారులు ముందుగా స్టాక్ నిలిపేసి నా, లేదంటే స్టాక్‌ను వెంటనే వేలంలో అమ్మినా సివిల్ సప్లయ్‌కు భారీనష్టం తప్పేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎవరీ సృజన్ రెడ్డి

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు వినిపిస్తున్న అత్యంత వివాదాస్పదమైన, ఆసక్తికరమైన పేరు సూదిని సృజన్ రెడ్డి. ప్రతీ దానికి సృజన్ రెడ్డి పేరును తెరపైకి తెస్తున్న బీఆర్ఎస్.. రేవంత్ పై ఆరోపణలు చేస్తోంది. కానీఈ సృజన్ రెడ్డి బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ కాంట్రాక్టులు పొందారని డీటైల్స్ వెలుగులోకి వచ్చాయి.సూదిని సృజన్ రెడ్డికి కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా, అధికార పార్టీ ఏదైనా తన హవాను కొనసాగించగల వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. సృజన్ రెడ్డికి ఉన్న రాజకీయ సంబంధాల చార్ట్ చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆయన మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డికి అల్లుడు కాగా, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భార్య వైపు నుంచి ఆయనకు కాస్త దూరం బంధుత్వం ఉంది. ఇలా అటు ప్రతిపక్షం, ఇటు అధికార పక్షం రెండింటితోనూ ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.సృజన్ రెడ్డి పేరు మొదట ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ప్రాచరంలోకి వచ్చింది. ఈ కేసులో ఈడీ, సిబిఐ సోదాలు జరిగినప్పుడు ఆయన పేరు ప్రముఖంగా వినిపించింది. అప్పట్లో బీఆర్ఎస్ అగ్రనేతలకు అత్యంత సన్నిహితుడిగా, ఆ పార్టీ ఆర్థిక మూలాల్లో కీలక వ్యక్తిగా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. రాజకీయ వర్గాల్లో కొందరు ఆయన్ని ఒక చిన్న చేపగా అభివర్ణిస్తే, మరికొందరు మాత్రం తెరవెనుక చక్రం తిప్పే "కింగ్‌పిన్" అని విశ్లేషిస్తుంటారకాంట్రాక్టుల విషయానికి వస్తే, సృజన్ రెడ్డికి చెందిన సంస్థలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీ ప్రాజెక్టులను దక్కించుకున్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టుల్లో ఆయన సంస్థలు కీలక పాత్ర పోషించాయి. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వంతో ఉన్న సాన్నిహిత్యం వల్ల వేల కోట్ల విలువైన పనులు ఆయనకు దక్కాయని విపక్షాలు ఆరోపించేవి. అయితే, ప్రభుత్వం మారిన తర్వాత కూడా సృజన్ రెడ్డి హవా తగ్గకపోవడం గమనార్హం.

# కదులుతున్న సింగరేణి డొంక



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి బొగ్గు గనుల కేటాయింపు వ్యవహారం ఇప్పుడు ఒక పెద్ద కుదుపుకు కారణమైంది.తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి కాలరీస్ చుట్టూ ముసురుకున్న అవినీతి ఆరోపణలు పెను దుమారం రేపుతున్నాయి. సింగరేణిలో జరుగుతున్న టెండర్ల ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఈ మొత్తం వ్యవహారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూత్రధారి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కుంభకోణంలో ప్రధానంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధనను హరీశ్ రావు ఎండగట్టారు. గతంలో లేని విధంగా, కేవలం తమకు కావలసిన కాంట్రాక్టర్లకు పనులు కట్టబెట్టేందుకే ఈ నిబంధనను తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. జనవరి 2025లో భూపాలపల్లి పనుల కోసం జారీ చేసిన టెండర్లలో ఎలాంటి సైట్ విజిట్ నిబంధన లేదని, అప్పుడు అంచనా వ్యయం కంటే 7 శాతం తక్కువకే టెండర్లు ఖరారయ్యాయని ఆయన గుర్తు చేశారు. మూడు నెలల వ్యవధిలోనే, అంటే మే 2025లో నిబంధనలను మార్చి కొత్త టెండర్లు జారీ చేయడంలోని అంతరార్థం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మార్పుల వల్ల పోటీ తగ్గి, సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన 'శోధా కన్‌స్ట్రక్షన్స్' లబ్ధి పొందిందని హరీశ్ రావు స్పష్టం చేశారు.నైనీ బ్లాక్ టెండర్లను ప్రభుత్వం రద్దు చేయడమే అక్కడ అక్రమాలు జరిగాయనడానికి నిలువెత్తు నిదర్శనమని హరీశ్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన వారికే కాంట్రాక్టులు దక్కేలా నిబంధనలను తుంగలో తొక్కారని విమర్శించారు. ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన మూడు ప్రధాన అంశాలను ఆయన లేవనెత్తారు. ఈ కుంభకోణానికి బాధ్యులు ఎవరు?, దీని వల్ల సింగరేణికి, ప్రభుత్వానికి జరిగిన నష్టం ఎంత?, ఈ వ్యవహారంలో వ్యక్తిగతంగా లబ్ధి పొందిన వారెవరు? లాంటి అంశాలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్ నిర్వహణ బాధ్యతలను ఒక ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు, చివరకు విచారణ డిమాండ్ల దాకా వెళ్లాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఈ అంశంపై మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ఒడిశాలో సింగరేణికి కేటాయించిన నైని బొగ్గు గని తవ్వకాల కోసం పిలిచిన టెండర్లలో నిబంధనలను ఒకరికి అనుకూలంగా మార్చారనేది ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఒక ప్రముఖ మీడియా సంస్థ అధిపతి అల్లుడికి చెందిన సంస్థకు ఈ కాంట్రాక్ట్ దక్కేలా చేస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. 'సైట్ విజిట్' నిబంధనను సాకుగా చూపి అర్హత ఉన్న సంస్థలను తప్పించారని విపక్షాలు ఆరోపించాయిఈ ఆరోపణలు వెల్లువెత్తిన వెంటనే అప్రమత్తమైన భట్టి విక్రమార్క, ప్రభుత్వంపై ఎటువంటి మచ్చ పడకూడదనే ఉద్దేశంతో ఆ టెండర్లను రద్దు చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. తాజాగా మీడియా ముందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ విమర్శలపై ధీటుగా స్పందించారు. కేవలం తాజా టెండర్లే కాకుండా, 2014 నుంచి సింగరేణిలో జరిగిన బొగ్గు గనుల కేటాయింపులన్నింటిపై విచారణ జరిపించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. "దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాయాల్సిన అవసరం లేదు. మాకు లేఖ రాస్తే చాలు, గత పదేళ్లలో జరిగిన ప్రతి వ్యవహారంపై సమగ్ర విచారణ చేయిస్తాం" అని భట్టి సవాల్ విసిరారు.ఈ వివాదంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు సృజన్ రెడ్డి. ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధం ఉందని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను భట్టి తీవ్రంగా ఖండించారు. సృజన్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ, అసలు వాస్తవాలను బయటపెట్టారు. సృజన్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అల్లుడని భట్టి వెల్లడించారు. ఆయన ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతున్నారని, సొంత పార్టీ నేత అల్లుడిపైనే బీఆర్ఎస్ బురద జల్లడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.టెండర్లలో అక్రమాలకు తావిచ్చేలా ఉన్న 'సైట్ విజిట్' నిబంధనపై భట్టి క్లారిటీ ఇచ్చారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని భట్టి పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాం నుంచే ఈ నిబంధన అమల్లో ఉందని, గతంలో జరిగిన కేటాయింపుల్లోనూ ఇదే పద్ధతి అనుసరించారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం ఇప్పుడు కేవలం ఒక టెండర్ రద్దుతో ముగిసిపోయేలా కనిపించడం లేదు. 2014 నుంచి జరిగిన కేటాయింపులపై విచారణకు ప్రభుత్వం సిద్ధమనడం ద్వారా బంతిని ఇప్పుడు బీఆర్ఎస్ కోర్టులోకి నెట్టింది. ఒకవేళ విచారణ జరిగితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలలోని లోపాలు కూడా బయటపడే అవకాశం ఉంది. మొత్తానికి, సింగరేణి బొగ్గు గనుల సెగ తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించబోతోంది.కేవలం టెండర్ల అక్రమాలే కాకుండా, సింగరేణి కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం మోసానికి పాల్పడిందని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సింగరేణికి సుమారు రూ. 6,900 కోట్ల లాభాలు వచ్చినప్పటికీ, ఆ లెక్కలను ప్రభుత్వం దాచిపెట్టిందని ఆరోపించారు. లాభాలను తక్కువ చేసి చూపడం ద్వారా కార్మికులకు దక్కాల్సిన బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం తగ్గించిందని ఆయన విమర్శించారు.సింగరేణిలో 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం, ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ఒకరికొకరు సహకరించుకుంటూ సింగరేణిని ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు వెంటనే స్పందించాలని, అప్పుడే నిజానిజాలు బయటకు వస్తాయని డిమాండ్ చేశారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసలు విషయాలను పక్కన పెట్టి, సంబంధం లేని పత్రాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' పేరుతో జారీ చేసిన అన్ని టెండర్లను రద్దు చేయాలని, తక్షణమే ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ఆయన పట్టుబట్టారు. ఈ ఆరోపణలతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.



## ఏడాదిలో విమానాల అద్దెకే 14 కోట్ల

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక విమానాల వినియోగంపై మరోసారి రాజకీయ చర్చ మొదలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఆయన ప్రయాణాలకు సంబంధించిన ఖర్చులు గణనీయంగా పెరిగినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముఖ్యంగా నాలుగో త్రైమాసికానికి సంబంధించిన ఖర్చుల కోసం సాధారణ పరిపాలన శాఖతాజాగా జారీ చేసిన ఉత్తర్వులు ఈ అంశాన్ని మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి.నాలుగో త్రైమాసికంలో హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల అద్దెల కోసం రాష్ట్ర ఆర్థిక శాఖ రూ.13.65 కోట్లను విడుదల చేసింది. దీనికి సంబంధించిన జీవో వెలువడటంతో ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఒకప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిప్రత్యేక విమానాల ఖర్చుపై తీవ్రంగా విమర్శలు చేసిన చంద్రబాబు, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మరింత ఎక్కువగా ఖర్చు చేస్తున్నారా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేయాల్సి ఉంటుంది. జిల్లాల మధ్య ప్రయాణాలకు హెలికాప్టర్ లేదా ప్రత్యేక విమానం వినియోగించడం తప్పు కాదన్న అభిప్రాయం కూడా ఉంది. ముఖ్యమంత్రి సమయానికి ఉ ండే విలువను దృష్టిలో ఉంచుకుంటే, వేగంగా ప్రయాణించాల్సిన అవసరం సహజమేనని కొందరు చెబుతున్నారు. అయితే వివాదానికి కారణమవుతున్నది అధికారిక పర్యటనలకన్నా, వారాంతాల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ మధ్య జరిగే ప్రయాణాలే.చంద్రబాబు కుటుంబం హైదరాబాద్‌లో ఉ ండటంతో వీకెండ్లలో అక్కడికి వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రయాణాలకు ప్రత్యేక విమానాలను వినియోగించడంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. విపక్ష నేతగా ఉన్న రోజుల్లో ఆయన సాధారణ పౌర విమానాల్లో ప్రయాణించేవారని, సామాన్యులతో కలిసి ప్రయాణించిన సందర్భాలు గుర్తు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి అయ్యాక భద్రతా కారణాలు, సమయపరిమితులు ఉండటం సహజమే అయినా, వ్యక్తిగత అవసరాలకు అయ్యే ఖర్చుపై మరింత జాగ్రత్తగా ఉండాల్సిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.అధికారిక గణాంకాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల కోసం మొత్తం ఖర్చు రూ.54.63 కోట్లకు చేరింది. తొలి త్రైమాసికంలో రూ.19.12 కోట్లు ఖర్చు కాగా, రెండో మరియు మూడో త్రైమాసికాల్లో రూ.10.92 కోట్ల చొప్పున వెచ్చించారు. తాజాగా నాలుగో త్రైమాసికానికి విడుదల చేసిన రూ.13.65 కోట్లతో మొత్తం వ్యయం రూ.54 కోట్లను దాటింది. ఈ సంఖ్యలు బయటకు రావడంతో విమర్శలు మరింత పెరిగాయి.ప్రత్యేక విమానాల వినియోగం చంద్రబాబుపై విమర్శలకు తరచూ కారణమవుతున్న అంశంగా మారింది. ఈ విషయాన్ని రాజకీయ ప్రత్యర్థులే కాదు, సొంత పార్టీ నేతలు కూడా ప్రస్తావిస్తున్నట్టు వినిపిస్తోంది. అధికారిక బాధ్యతలు, వ్యక్తిగత అవసరాల మధ్య స్పష్టమైన గీత గీయగలిగితే, ఇలాంటి విమర్శలకు తావు లేకుండా ఉంటుందన్న మాట రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది.

# ముందుకు సాగని అక్రమ ఆస్తుల కేసు..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** వైయస్ జగన్మోహన్ రెడ్డి పై సిబిఐ కేసుల విచారణ ప్రారంభం కాలేదు ఎందుకు? తెలుగుదేశం పార్టీ పట్టుబడడం లేదా?? కేంద్రం పట్టించుకోవడం లేదా? జగన్ విషయంలో బిజెపి సానుకూల వైఖరితో ఉందా? పొలిటికల్ వర్గాల్లో ఇదే ఆసక్తికర చర్చ. అయితే జగన్మోహన్ రెడ్డి పై నమోదైన కేసుల విషయంలో జాప్యం జరుగుతుండడం వెనుక.. చట్టంలో ఉన్న లొసుగులే ప్రధాన కారణం. ఎందుకంటే వరుసగా జగన్మోహన్ రెడ్డి విషయంలో డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు అవుతూనే ఉన్నాయి. అందుకే ఈ కేసు విచారణలో తాత్సారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఎంత మాత్రం రాజకీయ కోణం లేదన్నది విశ్లేషకుల మాట. తాజాగా దాల్మియా కంపెనీ దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్ తో ఇది స్పష్టం అవుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారు అన్నది జగన్మోహన్ రెడ్డి పై ఉన్న ఆరోపణ. దానిపైనే 11 సిబిఐ కేసులతో పాటు తొమ్మిది ఈడీ కేసులు నమోదయ్యాయి. జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ కూడా జరిగింది. దాదాపు 16 నెలల పాటు ఆయన రిమాండ్ ఖైదీగా కూడా ఉ ండిపోయారు. తరువాత బెయిల్ పై బయటకు వచ్చారు. గత 14 సంవత్సరాలుగా ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. కానీ ఆయన కేసులు మాత్రం విచారణకు నోచుకోవడం లేదు. దీనికి డిశ్చార్జ్ పిటిషన్లే కారణమని తెలుస్తోంది. అప్పట్లో ఓ 70 మంది వరకు జగన్మోహన్ రెడ్డి కేసుల్లో నిందితులుగా ఉన్నారు. పేరు మోసిన కంపెనీలు సైతం అప్పుడు క్విడ్ ప్రోలో భాగంగా జగన్మోహన్ రెడ్డి కంపెనీలలో పెట్టుబడులు పెట్టినట్లు సిబిఐ అభియోగాలను మోపింది. అయితే జగన్మోహన్ రెడ్డి కేసులతో తమకు సంబంధం లేదని.. తమ పేరును తొలగించాలని కోరుతూ ఎప్పటికప్పుడు పారిశ్రామికవేత్తలు కోర్టుల్లో డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. దాని ఫలితంగానే జగన్మోహన్ రెడ్డి కేసులు విచారణకు రాకుండా ఆగిపోతున్నాయి అనేది సిబిఐ వాదన.దాల్మియా సిమెంట్స్ సంస్థ డిశ్చార్జ్ పిటిషన్లు దాఖలు చేసింది. తమకు ఎంత మాత్రం జగన్మోహన్ రెడ్డి కేసుతో సంబంధం లేదని కోర్టులో వాదనలు వినిపించింది. అయితే సిబిఐ సైతం గట్టి వాదనలే వినిపించింది. జగన్మోహన్ రెడ్డి కంపెనీలలో దాల్మియా సిమెంట్స్ పెట్టుబడులు పెట్టిందని కోర్టు దృష్టికి తీసుకువెళ్ళింది. భారతి సిమెంట్స్ లో దాల్మియా కంపెనీ పెట్టుబడులు ఉన్నాయని వాదించింది. భారతి సిమెంట్స్ అనేది ముందుగా ఏర్పాటు కాలేదు. రఘురామ సిమెంట్స్ కంపెనీ పేరిట ఉన్న పరిశ్రమను వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్మోహన్ రెడ్డి కొనుగోలు చేశారు. అయితే అంతకు ముందే రఘురామా కంపెనీలో షేర్స్ కొనుగోలు చేసింది దాల్మియా. అయితే తరువాత భారతీ సిమెంట్ సైతం షేర్స్ కొనుగోలు చేసింది. కానీ భారతీయ సిమెంట్స్ కంటే దాల్మియా ఎక్కువ కోట్ చేసింది. అంటే రఘురామ సిమెంట్స్ ద్వారా ప్రయోజనాలు పొందాలనుకుంది. అయితే అప్పట్లో క్విడ్ ప్రో లో భాగంగానే దాల్మియా 95 కోట్ల రూపాయలు భారతి సిమెంట్స్ లో పెట్టుబడులు పెట్టింది. అయితే అప్పట్లో దాల్మియా సిమెంట్స్ కొన్ని రకాల పెట్టుబడులు పెట్టడం ద్వారా అప్పటి ప్రభుత్వం నుంచి లబ్ధి పొందింది అన్నది సిబిఐ వాదన. అయితే భారతి సిమెంట్స్ ను ఓ విదేశీ కంపెనీకి విక్రయించారు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇంకా ఉత్పత్తి ప్రారంభం కాక మునుపే భారతి సిమెంట్స్ ను 145 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది విదేశీ సంస్థ. ఈ అమ్మకం ద్వారా వచ్చిన మొత్తంతో సెటిల్ చేశారని చెబుతోంది దాల్మియా. అయితే దీనిపై సీబీఐ కోర్టులో దాల్మియా కంపెనీ డిశ్చార్జ్ పిటిషన్ కొట్టివేతకు గురైతే హైకోర్టును ఆశ్రయిస్తుంది. గత 14 సంవత్సరాలుగా ఇటువంటి డిస్చార్జ్ పిటిషన్లతోనే జగన్మోహన్ రెడ్డి కేసులు పెండింగ్లో ఉండిపోయాయి. అంతే తప్ప దీనికి రాజకీయ కారణాలు లేవు.

# 'మై బ్రిక్ - మై అమరావతి ' స్ఫూర్తితో..



**విజయవాడ,తెలంగాణ దిశ :** అమరావతినిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం మరో కీ లక నిర్ణయం తీసుకుంది. అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తోంది. ఇందులో భాగంగా రాజధాని అమరావతి నిర్మాణం కోసం విరాళాలు సేకరించాలని నిర్ణయించింది. అమరా వతికి విరాళాలు అందించాలనుకునే వారికోసం సీఆర్డీఏ వెబ్ సైట్‌లో క్యూఆర్ కోడ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అమరావతికి ఆన్‌లైన్ ద్వారా విరాళాలు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఏపీలోని కూటమి ప్రభు త్వం మరో కీలక అడుగు వేసింది. రాజధాని నిర్మాణంలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో విరాళాల సేకరణ ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక డిజిటల్ వ్యవస్థను కూడా అందుబాటు లోకి తీసుకువచ్చింది. ఆన్‌లైన్ ద్వారా విరాళాల సేకరణ ప్రారంభిం చింది. రాజధాని నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలనుకునే దాతల కోసం తన అధికారిక వెబ్‌సైట్ లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆన్ లైన్ విధానంలో విరాళాల సేకరణ కోసం సీఆర్డీఏ వెబ్‌సైట్‌లో 'ఆనీనిజీబివ టనీతీ ంఎజీతీజీలజీబితి' అనే ఆప్షన్ తెచ్చారు. ఒక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశారు. అమరావతికి విరాళాలు అందించాల నుకునే దాతలు గూగుల్ పే, ఫోన్ పే లేదా పేటీఎం వంటి ఏదైనా ఐఖఎ యాప్ ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా సీఆర్డీఏ బ్యాంక్ ఖాతాకు నిధులను పంపవచ్చు.మరోవైపు గతంలోనూ అమరావతి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. 2015లో రాజధాని నిర్మాణం కోసం'మై బ్రిక్ – మై అమరావతి' కార్యక్రమాన్ని చేపట్టారు. అప్పట్లో ఒక్కో ఈ–ఇటుక ధరను రూ. 10 గా నిర్ణయించగా, సామాన్యుల నుంచి సంపన్నుల వరకు వేలాది మంది స్పందించారు. ఎన్నారైలు సైతం ఈ – ఇటుకలను కొనుగోలు చేసి అమరావతి పట్ల తమ మమకారాన్ని చాటుకున్నారు. ఇప్పుడు మళ్ళీ అదే స్ఫూర్తిని రగిలించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.మరోవైపు ప్రస్తుతం అమరావతిలో తొలి విడత నిర్మాణ పనులు చేపడుతున్నారు.

ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అటు కేంద్రం నుంచి, ప్రపంచ బ్యాంకు ద్వారా అమరావతికి బ్యాంకుల నుంచి కూడా రుణాలు స్వీకరిస్తు?న్నారు. అలాగే ఇటు ప్రజల నుంచి వచ్చే విరాళాలను కూడా రాజధాని మౌలిక సదుపాయాల కోసం వినియోగించనున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మిస్తున్నన అమరావతి ప్రజా రాజధానికి ప్రజల భాగస్వామ్యం ఉండేలా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది.

# విద్యుత్ సమస్యలపై సమాచారం ఇవ్వండి

## ఎన్పీడీసీఎల్ ఏఈ నల్ల అశోక్ కుమార్

**కమాన్‌పూర్,తెలంగాణ దిశ :** విద్యుత్ సమస్యలు ఉన్నచో తమకు సమాచారం ఇవ్వాలని కమాన్ పూర్ ఎన్ పిడిసిఎల్. ఏ ఈ నల్ల అశోక్ కుమార్ కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాటతో విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టడం జరుగుతుందని గ్రామాల్లో ఏదైనా విద్యుత్ ఉన్నచో వాటిని పరిష్కరించేం దుకే ప్రభుత్వం ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించడం అశోక్ కుమార్ అన్నారు. శనివారం రొంపి కుంట గ్రామ సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్ అధ్యక్షతన విద్యుత్ అధికారులు ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రొంపి కుంట గ్రామంలో ఐరన్ విద్యుత్ పోలులను విరిగిన కరెంట్ స్తంభాలను తోపాటు వివిధ సమస్యలను గ్రామంలో తిరుగుతూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఏదైనా విద్యుత్ సమస్య ఉన్నచో అధికారులకు తెలియజేయాలని కోరారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను నమోదు చేసుకొని త్వరిత గతిన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఏదైనా విద్యుత్ బిల్లుల సమస్య ఉన్నచో తమకు సమాచారం ఇవ్వాలని ఏఈ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ సిరిపల్లి కృష్ణ , లైన్ ఇన్స్పెక్టర్ కాసుల రవి, ఉప సర్పంచ్ ముత్యం శ్యామ్ గౌడ్, మాజీ సర్పంచ్ కటకం రవీందర్, మాజీ ఎంపీటీసీ కటకం నారాయణ, వార్డ్ మెంబర్ కొండి అనిల్ ,లైన్మెన్ గురుముట్ల శ్రీధర్, కోల నరస గౌడ్ కమ్మగొని మల్లయ్య, అన్ మెన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




## మారుతోన్న నగరి లెక్కలు

**తిరుపతి,తెలంగాణ దిశ :**ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నగరి నియోజకవర్గం లో రాజకీయ వాతావరణం వేగంగా మారుతోంది. గత ఎన్నికల సమయంలో కనిపిం చిన సమీకరణలకు భిన్నంగా ఇప్పుడు పరిస్థితులు రూపుదిద్దుకుం టున్నాయి. ఈ మార్పులు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకురాలు రోజా రాజకీయ భవితవ్యంపై చర్చను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నాయి. ఒకప్పుడు నగరి పరిసర మండలాల్లో రోజా పేరు బలంగా వినిపించేది. కానీ గత ఎన్నికలకు ముందే ఆమె ఉనికి తగ్గినట్టు కనిపించగా, ఇప్పుడు మరింత మౌనం నెలకొన్నట్టు రాజకీయ వర్గాలు మాట్లాడుకుంటున్నాయి.నగరి నియోజకవర్గంలో నింద్ర , విజయపురం , నగరి , పుత్తూరు, వడమాలపే ట వంటి మండలాలు ఉన్నాయి. వీటిలో గత ఎన్నికలకు ముందు వరకు నింద్ర, వడమాలపేటల్లో రోజాకు గట్టి మద్దతు ఉందనే భావన ఉండేది. మంత్రిగా ఉన్న రోజుల్లో కూడా ఆమె ఈ రెండు మండలాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారని స్థానికులు గుర్తు చేస్తారు. తరచూ పర్యటనలు, కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఇవే తన బలం ఉన్న ప్రాంతాలుగా రోజా చెప్పుకొనేవారు.నగరి మండలంలో పరిస్థితి మాత్రం సమంగా ఉండేది. అభిమానులు ఉ న్నప్పటికీ వ్యతిరేకత కూడా అంతే స్థాయిలో ఉండేది. విజయపురం, పుత్తూరులో అయితే పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. అక్కడ వైసీపీ వర్గాలు రెండు గ్రూపులుగా విడిపోయాయి. ఈ పరిణామాలు గత ఎన్నికలకు ముందే మొదలయ్యాయి. అదే సమయంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉ ండటం కూడా రోజాకు సవాలుగా మారింది. ఈ కారణాల వల్ల ఆమె నింద్ర, వడమాలపేటలపైనే ఎక్కువగా ఆధారపడినట్టు కనిపించింది.అయితే తాజా రాజకీయ పరిణామాలు ఈ రెండు మండలాల్లో కూడా మార్పు వస్తున్నాయనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ నియోజకవర్గం అంతటా చురుకుగా పర్యటిస్తున్నారు. తమకు బలం ఉన్న ప్రాంతాలతో పాటు బలహీనంగా ఉన్న మండలాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టడం ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థాయిలో అమలు చేయడం, సమస్యలపై వెంటనే స్పందించడం వల్ల ప్రజల్లో ఆయన పట్ల అనుకూలత పెరుగుతోందని అంటున్నారు.ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు కూడా ఊపందుకున్నాయి. ఈ పరిణామాల ప్రభావంతో గతంలో రోజాకు అంతో ఇంతో మద్దతు కనిపించిన నింద్ర, వడమాలపేటల్లో ఇప్పుడు ఆమె పర్యటనలకు పెద్దగా స్పందన లేకపోతున్నట్టు చర్చ సాగుతోంది. ఒకప్పుడు కనిపించిన స్వాగతాలు, హడావిడి ఇప్పుడు తగ్గినట్టు స్థానిక రాజకీయ వర్గాలు చెబుతున్నాయిఈ మారుతున్న రాజకీయ సమీకరణలు వచ్చే ఎన్నికల నాటికి ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. నగరి నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు రోజా రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయా? లేక ఆమె మళ్లీ తన పాత బలాన్ని సమీకరించగలుగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం కాలమే చెప్పాల్సి ఉంది. కానీ ప్రస్తుతానికి మాత్రం నగరిలో రాజకీయ గాలి మారుతోందన్న మాట వినిపిస్తోంది.

# ఫ్రీగా గూగుల్ ఏఐ కోర్సు..




హైదరాబాద్, : ఎక్కడ చూసినా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ హవా నడుస్తుంది. ఏఐ స్కిల్స్ ఉన్న వారికే జాబ్ మార్కెట్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్, సాఫ్ట్‌వేర్, మీడియా సహా ఏ రంగం చూసినా ఏఐ వాడేస్తున్నారు. ఈ క్రమంలో భారతీయ విద్యార్థుల కోసం గూగుల్ ఏకంగా 3 వేలకుపైగా ఏఐ, టెక్ కోర్సులను ఉచితంగా అందిస్తుంది. ఈ ఏడాది గూగుల్ అందిం చిన అతిపెద్ద ఏఈ అవకాశాలలో ఇది ఒకటి. చాలా మంది ఇప్పటికే ఏఐ కోర్సుల్లో చేరి నైపుణ్యాలను ఒరిసి పట్టుకుంటున్నారు. గూగుల్ ఆఫర్ చేస్తున్న ఈ కోర్సులు ఎందుకూ పనికిరాని సర్టిఫికెట్ కోర్సులుగా భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఎందుకంటే ఇది కేవలం యాదృచ్ఛిక అభ్యాస పోర్టల్ కాదు. నిజానికి ఏఈ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి పలు సాంకేతికతలను రూపొందించిన గూగుల్ బృందాలచే రూపొందించబడిన కోర్సులు ఇవి. ప్రముఖ దిగ్గజ టెక్ కంపెనీలైన డెలాయిట్, యాక్సెంచర్‌తో సహా 150కి పైగా కంపెనీలు గుర్తించే నిజమైన సర్టిఫికేషన్‌లు ఇవి. ఈ ప్రోగ్రామ్‌లను పూర్తి చేసిన అభ్యర్థులను మాత్రమే ఈ కంపెనీలు నియమించు కుంటున్నాయి. బిగినర్స్ సర్టిఫికేట్‌లు ? నైపుణ్యం బ్యాడ్జ్‌లు ? గూగుల్ క్లౌడ్ సర్ట్‌లు వంటి మూడు స్థాయిల్లో ఈ కోర్సులను గూగుల్ అందిస్తుంది. ముఖ్యంగా ఏఈ, డేటా, క్లౌడ్, ఆటోమేషన్‌లోని కీలక జాబ్ రోల్స్‌కు ఈ నైపుణ్యాలు చాలా అవసరం. స్కిల్ బ్యాడ్జ్‌లను ప్రారంభ స్థాయి నుంచే సంపాదించవచ్చు. పరిశ్రమ గుర్తింపు పొందినగూగుల్ క్లౌడ్ ధృవీకరణలకు అన్ని విధాలుగా మార్పు చేసుకోవచ్చు. దీనితో పాటు ప్రతి నెలా 35 ఉచిత క్లౌడ్ క్రెడిట్‌లను కూడా పొందొచ్చు.కాబట్టి మీరు కేవలం వీడియోల కోసం మాత్రమే కాదు.. దిగ్గజ టెక్ కంపెనీలు ఫోకస్ చేసే నిజమైన ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే అనేక మంది లింక్డ్ఇన్‌లో పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటూ, తమ ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటున్నారు. కెరీర్‌లో దూసుకుపోవాలనుకునే వారు వీటిని నేర్చుకోవడం మరింత తెలివైన పని అని నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. కంపెనీల్లో ఎక్కువగా డిమాండ్ ఉన్న స్కిల్స్ ఏమిటో తెలుసుకుని.. వాటిని పెంపొందిం చుకుంటే భవిష్యత్తు మీదే అని అంటున్నారు. కంపెనీలకు డిగ్రీల అవసరం కంటేనైపుణ్యం ఉన్న వ్యక్తులుఅవసరం. కేవలం ఏఐ నేర్చుకోవడం మాత్రమే కాదు. గూగుల్ నిశ్శబ్దంగా తన భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌ను నిర్మిస్తోందన్న సంగతి మర్చిపోకూడదు. వారు ఇప్పుడు ఉచితంగా ఈ కోర్సుల్లో చేరమని ఆహ్వానిస్తున్నారు. ఏఐలో గెలిచిన వారంతా ఫ్యాన్సీ డిగ్రీలు ఉన్నవారు కాదు. వారు వాస్తవాన్ని గ్రహించి స్కిల్స్ పెంపొందించుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే ఏఐ యుగం ప్రారంభం అవుతోంది. ఈ క్రమంలో ఏఐ రైలు ఎక్కేందుకు గూగుల్ మీకు ఫస్ట్-క్లాస్ టిక్కెట్‌ను అందజేస్తుంది.

# మహానగర్ విస్తరణకు ఆర్థిక కష్టాలు!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ మహానగర విస్తరణ జలమండలికి కొత్తగా ఆర్థిక కష్టాలు తెచ్చిపెడుతోంది. ఇప్పటికే ప్రతి నెలా రూ.130కోట్ల లోటుతో నడుస్తున్న జలమండలికి కొత్త ప్రాంతాలను తీసుకురావడంతో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు జలమండలి పరిధి అధికారికంగా 1450.2 చదరపు కిలోమీటర్లు. తాజా విస్తరణతో 2,053.2 చదరపు కిలోమీటర్లు కానుంది. విలీనమైన ప్రాంతాల్లో భారీ సంఖ్యలో కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సిబ్బందిని అదనంగా నియమించుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జలమండలికి భారీగా నిధులు అవసరం కానున్నాయి. కొత్తగా విలీనమవుతున్న ప్రాంతాల్లో పటిష్టమైన తాగునీరు, మురుగునీటి వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా నిధులు అందించాలిహైదరాబాద్ నగరంలో పెరుగుతున్న మౌలిక సదుపాయాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు ప్రకటించిన ప్రభుత్వం.. అదే తరహాలో ప్రజాసమస్యలపై ఫోకస్ పెట్టేందుకు, హైదరాబాద్‌ను మరింత గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు సిద్ధమైంది. జీహెచ్ఎంసీ 300 వార్డులుగా విస్తరించినట్టు ప్రభుత్వం తెలిపింది. ఇప్పుడు అదే తరహాలో జలమండలిని విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు అధికారులు తెలిపారు. ప్రతి ప్రాంతంలోనూ సమస్యలను సూక్ష్మ స్థాయిలో గుర్తించి పరిష్కరించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అధికారులు అంటున్నారు. జలమండలిని విస్తరణ ద్వారా తాగునీటి సమస్యలు రాకుండా చూడాలన్నదే తమ లక్ష్యమంటున్నారు.నగరంలో 9వేల కిలో మీటర్ల రోడ్లలో 5వేల కిలో మీటర్ల ప్రధాన రోడ్లుండగా, దాదాపు 10వేల కిలో మీటర్ల మేర వర్షం నీటి డ్రైన్లు అవసరం ఉంది. కానీ గ్రేటర్‌లో వెయ్యి కిలో మీటర్లే వర్షం నీటి డ్రైన్‌లు ఉన్నాయి. అయితే రోజురోజుకూ కబ్జాలు పెరగడం.. మరో వైపు రోడ్లను విస్తరిస్తున్న క్రమంలో డ్రెయిన్ వాటర్ లైన్లు కనిపించకుండా పోతున్నాయి. ఇక అభివృద్ధి పేరుతో అపార్ట్‌మెంట్లు, కాంప్లెక్స్‌లు, మల్టీప్లెక్స్‌లు షాపింగ్ మాల్స్ ఇలా తదితర వాణిజ్య వ్యాపార భవంతులు వెలుస్తుండటంతో చినుకు పడితే సిటీ రోడ్లన్నీ చెరువులుగా తలపిస్తున్నాయి. కాలనీలు, బస్తీలు నీట మునుగుతున్నాయి. వీటన్నిటినీ కట్టడి చేసేందుకు ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దించింది. హైడ్రాకు వస్తున్న సత్ఫలితాలతో జలమండలి, జీహెచ్ఎంసీ విస్తరణను వేగవంతం చేసింది.కబ్జాదారుల నుంచి నగరాన్ని కాపాడి రాబోయే తరాల వారికి మంచి వాతావరణం, అభివృద్ధితోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించేందుకు ప్రభుత్వం హైడ్రాను 2024, జూన్ 18న ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తక్కువ సమయంలోనే దేశంలో ఏసంస్థకు ఇంతలా ప్రచారం కాలేదని మేధావులు, రాజకీయ నాయకులు, పండితులు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరుతో ప్రతి ఒక్కరిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అవగాహన వచ్చింది.ఇప్పుడు పార్కులు, నాలాలు, చెరువులకు కబ్జా చేయాలన్నా, అక్రమ నిర్మాణాలు చేపట్టాలన్నా వణుకు పుట్టించారు. అయితే హైడ్రా ఏర్పాటు చేయకముందే కాంగ్రెస్ ప్రభుత్వంలో జీహెచ్ఎంసీని మూడు మహానగర పాలక సంస్థలుగా చేయాలనే ఆలోచన ఉన్నదని విశ్వసనీయ సమాచారం. ఇందులో భాగంగానే మహానగర పాలక సంస్థలుగా విభజించే దిశగా ప్రక్రియ వేగం పుంజుకుంది. అధికారికంగా మూడు కార్పొరేషన్లుగా ప్రకటించకపోయినా, ఆ దిశగా అడుగులు వేస్తోంది. వచ్చే నెల 10వరకు ప్రస్తుత పాలక మండలి పదవీకాలం ఉండటంతో అప్పటిలోపు సిబ్బంది, ఇతరాత్ర విభజన ప్రక్రియను పూర్తి చేయాలనే స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం అందడంతో దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది.జీహెచ్ఎంసీ పరిధిలోకి 20 పురపాలికలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు కలిపి మొత్తం 27 పట్టణ స్థానిక సంస్థలను (యూఎల్‌బీలు) విలీనం చేయడంతో హైదరాబాద్ పురపాలనలో ప్రభుత్వం నగర పాలనలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ విలీనంతో జీహెచ్ఎంసీ 300 కార్పొరేషన్లు, 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం నుంచి 2,053 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించిందని ప్రచారం జోరందుకుంది.ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన హైడ్రా తరహాలోనే జీహెచ్ఎంసీని విస్తరించారు. ఇందులో భాగంగానే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మూడు కార్పొరేషన్లుగా విభజించేందుకు అంతా సిద్ధమవుతోంది. అందులో భాగంగానే ఉన్నతా ధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బందిని మూడు కార్పొరే షన్‌లకు విభజన ప్రక్రియను వేగవంతం చేశారు. ఇప్పటికే జోన్లకు జోనల్ కమిషనర్లను నియమించిన ప్రభుత్వం, 60 సర్కిళ్లకు డిప్యూటీ కమిషనర్లు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయా జోన్‌లకు పరిపాలన, ఆర్థిక, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలకు అధికారులు, సిబ్బంది బదిలీలు చేస్తున్నారు.హైడ్రా, జీహెచ్ఎంసీ తరహాలోనే జలమండలిని విస్తరిస్తున్నారు. జోన్లు, సర్కిళ్లు, సబ్ డివిజన్లు, వార్డులుగా సెక్షన్లగా విస్తరిస్తున్నారు. 12 జోన్లు, 60 సర్కిళ్లుగా విస్తరించే అవకాశముంది. 1450.2చ.కి.మీ. నుంచి 2,053.2చ.కి.మీ వరకు సేవలను అందించనున్నారు. తాగునీటి నల్లా కనెక్షన్లు 14,43,136, 9055.29 కి.మీ మురుగు నీటి పైపులైన్స్, 4,80,269 మాన్‌హోళ్లుండగా ప్రస్తుతం 583 ఏంజీడీల తాగునీరు సరఫరా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించిన అనంతరం నివేదిక తయారు చేయనున్నారు. విస్తరణలో భాగంగా ఐదు జోన్ల(సర్కిల్)కు అదనంగా కొత్తగా ఏడు జోన్లను ఏర్పాటు చేశారు.59 సర్కిల్స్ (సబ్‌డివిజన్) ఉండగా కొత్తగా మరొకటి ఏర్పాటు చేశారు. 192 వార్డులు (సెక్షన్) ఉండగా అదనంగా మరో 108 ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల వరకు ఉన్న పరిధిని ప్రస్తుతం ఓఆర్ఆర్ వెలుపల కూడా విస్తరించారు. జోనల్ అధికారులుగా చీఫ్ జనరల్ మేనేజర్లు(సీజీఎం) బాధ్యతలు చేపట్టనున్నారు. జోన్ పరిధిలో నాలుగు నుంచి ఆరు సర్కిళ్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిసింది. జోనల్ కార్యాలయంలో ఇద్దరు చొప్పున జనరల్ మేనేజర్లు (జీఎంలు) ఉంటారు. ఒక్కో జీఎం రెండు నుంచి మూడు సర్కిళ్లను పర్యవేక్షిస్తారు. సర్కిళ్లలో సర్కిల్ అధికారిగా డిప్యూటీ జనరల్ మేనేజర్లు (డీజీఎంలు) బాధ్యతలు చేపట్టనున్నారు. వారు నాలుగు నుంచి ఐదు వార్డులను పర్యవేక్షించనున్నారు. వార్డు ఆఫీసర్లుగా మేనేజర్లు బాధ్యతలు తీసుకోనున్నారు.లేకపోతే ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదని ఉన్నతాధికారులు అభిప్రాయ పడుతున్నారు.

# విజయనగరంలో కొత్త పోలీస్ స్టేషన్లు

**విజయనగరం,తెలంగాణ దిశ :** విజయనగరం జిల్లాలో రెండు పోలీసు స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. జిల్లాలో జనాభా పెరుగుదల, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నేపథ్యంలో ఈ 2 కొత్త పోలీస్ స్టేషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. నెలఖరులోగా కార్యకలాపాలు మొదలయ్యేలా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రతిపాదనకు ఆమోదం లభించగా, భోగాపురంలో విమానాశ్రయం కోసం ప్రత్యేకంగా మరో స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఇవి శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించనున్నా యి. విజయనగరం జిల్లాలో త్వరలోనే కొత్తగా రెండు పోలీస్ స్టేషన్లు ప్రారంభం కానున్నాయి. జనవరి నెలఖరులోగా ఈ రెండు పోలీస్ స్టేషన్ల కార్యకలాపాలు మొదలవుతాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. విజయనగరంలో పెరుగుతున్న జనాభాకు మెరుగైన సేవలు అందించేందుకు గాను అధికారులు ఈ రెండు పోలీస్ స్టేషన్లను ప్రారంభించబోతున్నారు. వీటిలో ఎన్నో ఏళ్ల నాటి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు కూడా ఉంది. అలాగే, భోగా పురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం వల్ల.. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. ప్రత్యేకంగా మరో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ రెండు స్టేషన్లు ప్రజలకు మరింత చేరువగా ఉండి, శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. విజయనగరంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత పది సంవత్సరాలుగా ఎన్నోసార్లు ప్రతిపాదించారు. వీటికి తాజాగా ఆమోదం లభించింది. విజయనగరం లో జనాభా విపరీతంగా పెరిగిపోవడంతో, ప్రస్తుతం ఉన్న రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజలకు సేవలు అందించడం కష్టమవుతోందని గుర్తించారు. ఈ నేపథ్యంలో, కేఎల్ పురం, కణపాక ప్రాంతాల్లో కొత్త స్టేషన్ ఏర్పాటుకు స్థల సేకరణ జరుగుతోంది. నెలఖరులోగా తాత్కాలిక భవనంలో ఈ స్టేషన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భోగాపు రంలో అంతర్జాతీయ విమానాశ్రయం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో, అక్కడ ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న భోగాపురం పోలీస్ స్టేషన్‌తో పాటు, విమానాశ్రయం పరిధిలో ప్రోటోకాల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి ప్రత్యేక అవసరాల కోసం ఈ కొత్త పోలీస్ స్టేషన్ మంజూరైంది. భోగాపురం విమానాశ్రయం పనులు చివరి దశకు చేరుకున్నాయి. తాజాగా నిర్వహించిన ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది. జూలై నుంచి భోగాపురం విమానాశ్రయం సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని.. భోగాపురం విమానాశ్రయంలో వి అధికారుల నియామకంపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ రెండు పోలీస్ స్టేషన్ల ఏర్పాటు జరుగుతోందని అధికారులు అంటున్నారు.

# ధనవంతుల కోసం యూరప్‌తో ఒప్పందం

## లగ్జరీ కార్లపై భారీగా సుంకాలు తగ్గింపు



న్యూఢిల్లీ : ధనవంతుల ఆసక్తుల కోసం యూరోపియన్ యూనియన్ (ఇయు)తో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి వెంపర్లాడుతోంది. లగ్జరీ కార్ల టారిఫ్‌లపై భారీగా సుంకాలను తగ్గించడానికి మోడీ సర్కార్ అంగీకరించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. దీనికి సంబంధించిన కీలక ప్రతిపాదనలు సిద్ధం అవుతోన్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఇయు నుంచి దిగుమతి అవుతున్న ఆ కార్లపై ప్రస్తుతం 110 శాతంగా ఉన్న టారిఫ్‌లు 40 శాతానికి తగ్గించేందుకు కేంద్రం అంగీకరించింది. 15వేల యూరోల (దాదాపు రూ.16 లక్షలు) కంటే ఎక్కువ ధర ఉన్నవాటికి ఈ వెసులుబాటు కల్పించనుంది. భవిష్యతులో ఈ సుంకాలు మరింత తగ్గొచ్చని అంచనా. టారిఫ్‌లను భారీగా తగ్గించే వోక్స్‌వ్యాగన్, మెర్సిడజ్ బెన్, బిఎండబ్ల్యు వంటి యూరప్ లగ్జరీ కార్లు భారత మార్కెట్లో మరింత అమ్మకాలను పెంచుకోనున్నాయి.

భారత్, ఇయు మధ్య ఒప్పందం దిశగా ఇంకా చేయాల్సిన పని ఉందని ఇటీవల ఇయు అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ పేర్కొన్నారు. తాము చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దశలో ఉన్నామన్నారు. కొందరు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలుస్తున్నారన్నారు. దీనివల్ల కోట్లాది మంది ప్రజలకు వస్తువులు, సేవలు ఎగుమతి, దిగుమతి చేసుకొనే సౌలభ్యం కలుగుతుందన్నారు. ప్రస్తుతం ఉర్సులా భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యారు. ప్రస్తుత పర్యటనలోనే భారత్, ఇయు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక అంగీకారం జరగొచ్చని తెలుస్తోంది.

# గ్రేటర్ లో బలవంతులదే రాజ్యం?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలనలో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారింది. అధికారుల బదిలీలు ప్రహసనంగా మారాయి. సమర్థత, నిజాయితీ కంటే రాజకీయ అండదండలు, పైరవీలకే పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు, ఏసీబీ విచారణల పరిధిలో ఉన్నవారు సైతం చక్రం తిప్పుతూ, బదిలీ అయిన గంటల వ్యవధిలోనే తిరిగి తమకు నచ్చిన పోస్టింగ్‌లను దక్కించుకుంటున్న వైనం బల్దియాలో చర్చనీయాంశంగా మారింది.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తీసుకుంటున్న నిర్ణయాలు, జారీ చేస్తున్న సర్క్యులర్లు గందరగోళానికి గురిచేస్తున్నాయి. మొదట ఒక అధికారిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం.. రాజకీయ ఒత్తిళ్లు రావడం తోనో, లేక తెరవెనుక ఒప్పందాల తోనో కేవలం రెండు గంటల వ్యవధిలోనే ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకుని కొత్త సర్క్యులర్ జారీ చేయడం పరిపాటిగా మారింది. ఈ వ్యవహారం వెనుక భారీ ఎత్తున దందా నడుస్తోందన్న ఆరోపణలు వి నిపిస్తున్నాయి.అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ గా ఉన్న జ్యోతి రెడ్డి వ్యవహారం విస్మయం కలిగిస్తోంది. కమిషనర్ ఆర్వీ కర్ణన్ మొదట జారీ చేసిన ఉత్తర్వుల్లో ఆమెను పటాన్చెరువు డీసీ గా బదిలీ చేశారు. అయితే,ఆఉత్తర్వు వెలువడిన గంటల వ్యవధిలోనే సీన్ మారిపో యింది. రాజకీయ ఒత్తిడితో తిరిగి ఆమెను అమీన్పూర్డీసీగానే కొనసాగిస్తూ కమిషనర్ సవరించిన సర్క్యులర్ జారీ చేశారు.

గంటల వ్యవధిలో ఆమె బదిలీ ఎందుకు ఆగింది.. ఆమె వెనుక ఉన్న శక్తి ఎవరన్నది ఇప్పుడు ప్రశ్నార్థకం.పటాన్చెరు డీసీగా పనిచేస్తున్న సతీష్ విషయంలోనూ ఇదే తంతు నడిచింది. మొదట ఆయన్ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సాధారణంగా హెడ్ ఆఫీస్‌కి పంపడమంటే లూప్ లైన్ కింద లెక్క. కానీ, రెండు గంటల్లోనే చక్రం తిప్పిన సదరు అధికారి.. ఏకంగా యూసఫ్ గూడా డీసీగా కీలకమైన పోస్టింగ్ దక్కించుకోవడం విశేషంఆదిభట్ల డీసీగా ఉన్న సత్యనారాయణ రెడ్డిని మొదట యూసఫ్ గూడాకు బదిలీ చేశారు.అయితే, ఆయనకు ఆ స్థానం నచ్చలేదో లేక ఆదిభట్లలోనే ఉండాలని రాజకీయ నేతలు కోరుకున్నారో తెలియదు కానీ, రెండు గంటల్లోనే ఆయన బదిలీ ఉత్తర్వులు రద్దయ్యాయి. తిరిగి ఆదిభట్ల డీసీగానే పోస్టిం గ్ ఇస్తూ కమిషనర్ కార్యాలయం నుంచి మరో ఆర్డర్ వచ్చింది.బడంగ్పేట కార్పొరేషన్ వ్యవహారం అయితే అవినీతికి నిలువుటద్దంగా మారింది. బడంగ్పేట కమిషనర్గా ఉన్న సరస్వతిపై గతంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమెను ఇటీవలే కమిషనర్ ఆర్వీ కర్ణన్ హెడ్ ఆఫీస్కు సరెండర్ చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారు. ఆమె తనకున్న పొలిటికల్ ఇన్ఫ్లుయెన్స్తో ఏకంగా బడంగ్పేట సర్కిల్కు డిప్యూటీ కమిషనర్ పోస్టును సష్టించుకుని, తెప్పించుకుని మరీ తిరిగి అదే స్థానంలో తిష్టవేయడం గమనార్హం. అవినీతి ఆరోపణలున్న వ్యక్తికి ప్రమోషన్ లాంటి పోస్టింగ్ ఇవ్వడంపై నిజాయితీ గల ఉద్యోగులు విస్తుపోతున్నారు.

# ఇక తగ్గనున్న రిజిస్ట్రేషన్ కష్టాలు!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ ప్రభుత్వం వాహన రిజిస్ట్రేషన్ విధానంలో కొత్త పద్ధతి అమలులోకి తెచ్చింది. ఇటు వాహనదారులకు, అటు రవాణా అధికారులకు ఇద్దరికీ మేలు జరిగేలా నూతన విధానం నుంచిఅమలులోకి వచ్చింది. వాహనం కొన్న చోటే రిజిస్ట్రేషన్ చేసే విధానం ప్రవేశపెట్టింది. మాదాపూర్ రవాణా కార్యాలయంలో నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. దీంతో రాష్ట్రమంతా అమలులోకి తెచ్చింది. కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే ఇకపై ఆర్టీవో కార్యాలయాల్లో క్యూలు, చక్కరలు అవసరం లేదు. డీలర్లు ఫొటోలు, డాక్యుమెంట్లు ఆన్‌లైన్‌లో సమర్పించి నంబర్ కేటాయిస్తారు. డీలర్లు ఇన్‌వాయిస్, బీమా, చిరునామా ధ్రువీకరణ, వాహన చిత్రాలు అప్‌లోడ్ చేస్తారు. అధికారులు డిజిటల్ పరిశీలన తర్వాత ఆమోదం ఇస్తారు. ఆర్సీ కార్డు చిరునామాకు పోస్ట్ అవుతుంది. అవసరమైతే షోరూమ్‌లో తనిఖీ జరుగుతుంది. అయితే కొత్త విధానం ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు మాత్రమే.వాణిజ్య వాహనాలు ఆర్టీవో లోనే చేసుకోవాలి.ఆర్టీవోలో స్లాట్ బుకింగ్, వేచి ఉండటం ముగిసిపోతుంది. కొనుగోలు రోజు సాయంత్రానికి రిజిస్ట్రేషన్ పూర్తి. పట్టణ ప్రజలకు మార్గదర్శకం. డిజిటల్ పారదర్శకత పెరుగుతుంది, అక్రమాలు, బ్రోకర్ వ్యవస్థ తగ్గుతుంది. ఈ వ్యవస్థ వాహన డీలర్లను బలోపేతం చేస్తుంది. వినియోగదారుల అనుభవం మెరుగవుతుంది. రాష్ట్ర వ్యాప్త అమలుతో ట్రాఫిక్, కార్యాచరణ సమస్యలు తగ్గుతాయి. తెలంగాణ సంయుక్త రవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ వాహనాల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన నూతన విధానాన్ని ప్రారంభించారు. ఈ విధానం వల్ల వినియోగదారులకు సమయం ఆదా అవుతుంది. రిజిస్ట్రేషన్ కోసం రవాణా కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరంలేదు. వాహనం అమ్మిన డీలర్ శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్లైన్‌లో దరఖాస్తు చేస్తారు. రవాణా శాఖ అధికారులు ఆన్లైన్లో పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారు. ఉదయం వాహనం కొనుగోలు చేస్తే.. సాయంత్రానికి శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఒకవేళ ఆ వాహనాన్ని సాయంత్రం కొనుగోలు చేస్తే.. రిజిస్ట్రేషన్ మాత్రం మరుసటి రోజు పూర్తవుతుంది.ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ కోసం ఇన్ వాయిస్, ఫారం 21, ఫారం 22, ఇన్సూరెన్స్, అడ్రస్ ప్రూఫ్, వెహికల్ ఫోటోలను డీలర్ ఆన్లైన్లో అప్లోడ్ చేస్తాడు. రవాణా శాఖ అధికారి ఆ దరఖాస్తు మొత్తాన్ని పరిశీలించి.. రిజిస్ట్రేషన్ నెంబర్ కేటాయిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి అయిన తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ స్పీడ్ పోస్ట్ ద్వారా వాహనాన్ని కొనుగోలు చేసిన వ్యక్తికి వెళ్తుంది. శాశ్వత రిజిస్ట్రేషన్లకు సంబంధించి అవసరమైతే వాహనాలను తనిఖీ చేస్తామ ని.. డీలర్ల షోరూంలోకి వెళ్లి వాహనాలను పరిశీలిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ విధానం కేవలం బైక్, కార్లకు మాత్రమే వర్తిస్తుంది. కమర్షియల్ వెహికల్స్ రిజిస్ట్రేషన్ యథావిధిగా ఆర్టీవో కార్యాలయాలలోనే జరుగుతూ ఉంటుంది.

# సినిమా

# స్పిరిట్ వర్సెస్ వారణాసి...




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ లోని మూవీ లవర్స్ అందరూ మన టాలీవుడ్ వైపు చూసే సంవత్సరం. రెబల్ స్టార్ ప్రభాస్ హీరో గా నటిస్తున్న 'స్పిరిట్', మహేష్ బాబు -రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'వారణాసి', ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'డ్రాగన్', అల్లు అర్జున్ – అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న మహేష్ బాబు 23 , ఇలా ఇంటర్నేషనల్ మార్కెట్ లను షేక్ చేసే సినిమాలన్నీ ఒకే సంవత్సరం లో రాబోతున్నాయి. అయితే మార్కెట్ లో విపరీతమైన క్రేజ్ ని సంపాదించుకున్న ప్రభాస్ స్పిరిట్, మహేష్ బాబు వారణాసి చిత్రాలు మాత్రం ఒకే నెలలో విడుదల కాబోతున్నాయి అనేది లేటెస్ట్ గా ఫిలిం నగర్ లో వినిపిస్తున్న వార్త. డైరెక్టర్ సందీప్ వంగ 'స్పిరిట్' చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్టు అధికారిక ప్రకటన చేసాడు. వారణాసి' చిత్రాన్ని కూడా ప్రస్తుతానికి అదే నెలలో విడుదల చేసే ప్లాన్ లో ఉన్నాడట డైరెక్టర్ రాజమౌళి.

ఈ ఏడాది సెప్టెంబర్ లోపు ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కార్యక్రమాలు మొత్తం పూర్తి అవుతాయట. కేవలం సంబంధించిన వర్క్ మీద మాత్రమే ఫోకస్ పెడతారట మేకర్స్. ఈ సినిమా ఎఈచీ వర్క్ కోసం ఏకంగా హాలీవుడ్ సంస్థలు పని చేయబోతున్నాయట. ఇప్పటికేకొంత పార్ట్ఈచీ ని కూడా పూర్తి చేసినట్టు తెలుస్తోంది. మహేష్ బాబు శ్రీ రాముడి లుక్ లో కనిపించే షాట్ ని వేరే లెవెల్ లో షూట్ చేశారట మేకర్స్. ఇదిఈ ఏడాది మహేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా విడుదల చేసే అవకాశాలు ఉన్నాయట.

ఈ లుక్ వచ్చిన తర్వాత సోషల్ మీడియా లో మొత్తం షేక్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.కానీ ఈ చిత్రం 'స్పిరిట్' తో పోటీ పడితే పూర్తి స్థాయి పొటెన్షి యల్‌ని చూపించడం కష్టమేనా?.కేవలం వారణాసి కి మాత్రమే కాదు, స్పిరిట్ చిత్రానికి కూడా బాక్స్ ఆఫీస్ వద్ద పూర్తి స్థాయి పొటెన్షియల్ చూపించేఅవకాశం ఉండదు. రెండు కూడా 3000 కోట్ల గ్రాస్ వసూ ళ్లనురాబట్టే సత్తా ఉన్న సినిమాలే. కాబట్టి ఇప్పుడు ఎలా ఉన్నా విడుద లసమయానికి కచ్చితంగా ఎదో ఒక సినిమా వెనక్కివెళ్తుందని, టాలీవుడ్ లో ఇది వరకు ఇలాంటివి చాలానే జరిగాయని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరగబోతుంది అనేది.

# రవితేజకు కొత్త ఆశలు రేపుతున్న 'ఇరుముడి'




మాస్ మహారాజ్ రవితేజ కెరీర్ గత కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో సాగడం లేదు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ, ప్రేక్షకుల్లో ఆ సినిమాలు పూర్తి సంతృప్తిని కలిగించలేకపోయాయి. మాస్ ఇమేజ్‌కు కాస్త విరామం ఇచ్చి, క్లాస్ టచ్‌తో చేసిన 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా సంక్రాంతి బరిలో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. .

దీంతో రవితేజ తదుపరి ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.ఈ క్రమంలోనే ఆయన దర్శకుడు శివ నిర్వాణతో చేతులు కలిపారు. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. అయ్యప్ప స్వామి మాలధారణలో రవితేజ కనిపించిన లుక్ సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకుంది.

పోస్టర్ చూసిన వెంటనే ఒక డివోషనల్ ఫీల్, పాజిటివ్ వైబ్స్ కలుగుతున్నాయన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయ్యప్ప మాలధారణలో ఇరుముడికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఈ సినిమాలో ఎమోషనల్‌గా, డీప్‌గా చూపించబోతున్నా రని సమాచారం.

సెన్సిటివ్,క్లాస్ కథనాలతో పేరు తెచ్చుకున్న శివనిర్వాణ ఈసారి డివోషనల్ టచ్‌తో కథను తెరకెక్కిస్తుండటంతో అంచ నాలు మరింత పెరిగాయి. మాస్‌కు భిన్నంగా, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమా ద్వారా రవితేజ కొత్త ఇమేజ్‌ను ఆవిష్కరించబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి జీ.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇక అయ్యప్ప మాలధారణ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, 2026 ఎండింగ్‌లో సినిమాను విడుదలచేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద 'ఇరుముడి' రవితేజ కెరీర్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందా? అనే ఆసక్తి ఇండస్ట్రీలోనూ, అభిమానుల్లోనూ పెరుగుతోంది.

# దేవర 2 షూటింగ్ పై ఫుల్ క్లారిటీ ఇచ్చిన నిర్మాత సుధాకర్





యంగ్ టైగర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ హీరో–హీరోయిన్లుగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన దేవర పార్ట్–1 పాన్–ఇండియా స్థాయిలో భారీ సక్సెస్ సాధించిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా? లేదా? అనే అనుమానాలు ప్రేక్షకులల్లో పెరుగుతున్న వేళ... నిర్మాత మిక్కిలినేని సుధాకర్ స్పష్టమైన అప్‌డేట్ ఇచ్చారు. ఒక ప్రైవేట్ ఈవెంట్‌లో సుధాకర్ మాట్లాడుతూ...దేవర2 షూటింగ్ ఈ ఏడాది మే నెలలో ప్రారంభమవుతుంది. అలాగే ఈ సినిమాను 2027లో థియేటర్లలో విడుదల చేస్తాం:: అంటూ స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ వ్యాఖ్యలు ఎన్టీఆర్ ఫ్యాన్స్‌లో సంతోషాన్ని నింపాయి. గత కొన్ని నెలలుగా ‹దేవర 2‹పై ఎలాంటి అప్‌డేట్ రాకపోవడంతో, సీక్వెల్ రద్దు అవుతుందేమో అనే డౌట్స్ నెలకొన్నాయి. కానీఇప్పుడు నిర్మాత చేసిన ప్రకటనతో అనుమానాలు తొలగిపోయాయి. కొరటాల శివ–ఎన్టీఆర్ కాంబినేషన్ ఇప్పటికే ‹జనతా గ్యారేజ్‹, ‹దేవర‹తో బ్యాక్–టు–బ్యాక్ సూపర్ హిట్స్ ఇచ్చింది. ఇప్పుడు ‹దేవర 2‹తో హ్యాట్రిక్ హిట్ కొట్టాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. సోషల్ మీడియాలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఇప్పుడు జోష్‌లో ఉన్నారు – దేవర 2 కోసం వెయిట్ చేస్తున్నాం, హ్యాట్రిక్ హిట్ ఖచ్చితం అంటూ పోస్టులు పెడుతున్నారు.

# పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణంపై నటి భూమిక ఆసక్తికర వ్యాఖ్యలు



# రావిపూడి అనిల్ తో నవీన్ సినిమా ఫైట్






ఒక సినిమా తీసి సక్సెస్ ని సాధించాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని ఎందుకంటే ఆ సినిమా కథ ఏ జానర్ కి చెందిందిఆ సినిమాను ప్రేక్షకుడికి నచ్చేట్టుగా ఎలా చేయాలి అని దర్శకుడు అనునిత్యం మథనపడుతూ ఒక బెస్ట్ ప్రొడక్ట్ ఇవ్వడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తాడు. ఇక ఇలాంటి సందర్భంలోనే ప్రస్తుతం నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం ఒక బెస్ట్ సినిమాను ప్రేక్షకులకు అందించడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఈయన సినిమా సినిమాకిమధ్య చాలా ఎక్కువ గ్యాప్ తీసుకుంటాడు. తక్కువ సినిమాలు చేసిన కూడా ప్రేక్షకుడికి నచ్చే సినిమాలు చేయాలనే ఆయన ముందుకు సాగుతున్నాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ', 'జాతి రత్నాలు', 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' లాంటి సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇప్పుడు 'అనగనగా ఒక రాజు' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. సంక్రాంతి కానుకగా జనవరి 14వ తేదీన ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే దసర పండుగను పురస్కరించుకొని అనగన గా ఒక రాజు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ ని చేపట్టారు. నవీన్ పోలిశెట్టి గోదారి గట్టున నడుచుకుంటూ వెళ్తుంటే కొంతమం ది ప్రేక్షకులు అతన్ని కలిసి ఏం బాబు ఇలా వెళ్తున్నావు నీ ఫేస్ బ్రైట్‌గా వెలిగిపోతుంది అని అడగగా, మన సినిమా గురించి మీకు తెలుసు కదా అని నవీన్ పోలిశెట్టి అడుగుతాడు. వాళ్లు మాకెందుకు తెలియదు 'అనగనగా ఒక రాజు' అంటూ సినిమా టైటిల్ ని చెప్పేసారు. సినిమా కోసం మేమంతా వెయిట్ చేస్తున్నామంటూ వాళ్ళు చెప్పిన మాటలతో ఇంప్రెస్ అయిన నవీన్ పోలిశెట్టి వాళ్ళందరికి టికెట్లనుఫ్రీగా ఇస్తున్నాను అంటూ ప్రకటించారు.దాంతో తనసినిమాని చాలా డిఫరెంట్ వేలో ప్రజెంట్ చేస్తున్నాడంటూ అలాగే ప్రమోషన్స్ భారీ లెవెల్లో చేస్తున్నాడు అంటూ సోషల్ మీడియా లో కొన్ని కథనలైతే వెలువడుతున్నాయి. ఇక ఇంతకుముందు అనిల్ రావిపూడి లాంటి దర్శకుడు సైతం 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు భారీగా ప్రమోషన్స్ చేపట్టి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లి సూపర్ సక్సెస్ ని సాధించాడు.ఇప్పుడు ఈ సినిమాని సైతం ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇక ఈ క్రమంలోనే నవీన్ పోలిశెట్టి లాంటి యంగ్ హీరో సైతం అనిల్ రావిపూడి కి గట్టిపోటీ ఇస్తు ప్రమోషన్స్ చేపట్టడం అనేది నిజంగా చాలా గొప్ప విషయం అంటూ చాలా మంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తుండటం విశేషం

పవన్ కల్యాణ్, భూమిక కాంబినేషన్‌లో వచ్చిన 'ఖుషి' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో, ఆయనపై నటి భూమిక చావ్లా హృదయపూర్వక ప్రశంసలు కురిపించారు. ఒకప్పటి తన సహనటుడు రాజకీయాల్లో ఉన్నత శిఖరాలకు చేరడంపై ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం భూమిక తన కొత్త చిత్రం 'యుఫోరియా' ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.'ఖుషి' సినిమాలో పవన్ కల్యాణ్‌తో కలిసి పనిచేసిన రోజులు ఇంకా గుర్తున్నాయి. ఒక నటుడిగా ప్రయాణం మొదలుపెట్టి, ప్రజాసేవ వైపు అడుగులు వేసి, ఇప్పుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన తీరు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ఆయన పడిన కష్టానికి, నిబద్ధతకు ఈ విజయం ఒక నిదర్శనం. ఆయన సాధించిన ఈస్థాయి ఎంతో మంది యువతకు ఆదర్శంఅని కొనియాడారు. కేవలం ప్రశంసలతోనే ఆగకుండా, పవన్ కల్యాణ్‌కు తన శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. ‹‹పవన్ కల్యాణ్‌కు భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆయన ప్రజలకు మరింత గొప్ప సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను. అని భూమిక పేర్కొన్నారు. ఒక నటుడిగా అసాధారణమైన స్టార్‌డమ్ చూసి, ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి, అనేక సవాళ్లను ఎదుర్కొని ఇప్పుడుఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం నిజంగా అభినందనీయమని ఆమె అన్నారు. భూమిక చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215